
తెలుగు దినపత్రిక
RNI APTEL/1999/00110
# కబురు
KABURU TELUGU DAILY
సంపుటి : 23 సంచిక : 80 | బుధవారం మార్చి 05 2025 | ఎడిటర్: శివకుమార్ గౌడ్ | పేజీలు 8 | వెల-5

హీరో లేకుండా సినిమా తీస్తా

ఆసక్తికర కామెంట్స్ చేసిన సందీప్ వంగా

మిగతాది 8లో

ఇదండీ..కబురు..






## రూ. 1,891 కోట్ల బకాయిలు చెల్లించండి..

## కేంద్ర మంత్రికి CM రేవంత్, మంత్రి ఉత్తమ్ వినతి

- 2021 మే నుంచి 2022 మార్చి వరకు సరఫరా చేసిన అదనపు బియ్యం కోసం రూ.343.27 కోట్ల బకాయిలు విడుదల చేయాలని విజ్ఞప్తి.
- 2021 జూన్ నుండి 2022 ఏప్రిల్ వరకు నాన్ ఎన్ఎఫ్ఎస్ఏ కింద సరఫరా చేసిన బియ్యం కోసం రూ.79.09 కోట్ల బకాయిలు విడుదల చేయాలని కోరారు.
- కస్టమ్ మిల్లింగ్ రైస్ (%జవీ=%) గడువును నెల రోజులు కాకుండా కనీసం నాలుగు నెలలు పొడిగించాలని సిఫారసు.
- రాష్ట్రానికి 4,000 మెగావాట్ల సోలార్ విద్యుత్ అనుమతులు పునరుద్ధరించాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు.
- సోలార్ విద్యుత్‌ను మహిళా సంఘాల ద్వారా ప్రోత్సహిస్తున్నట్లు కేంద్ర మంత్రికి వివరించారు.

కబురు న్యూస్,ఢిల్లీ మార్చి04:

భారత ఆహార సంస్థకు (ఎఫ్‌సీఐ) 2014-15 ఖరీఫ్ కాలంలో సరఫరా చేసిన బియ్యానికి సంబంధించి తెలంగాణకు రావాల్సిన రూ.1,468.94 కోట్ల బకాయిలు వెంటనే చెల్లించాలని కేంద్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మంగళవారం(మార్చి 4) కేంద్ర మంత్రిని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా వీరు.. గతంలో అదనపు లెవీ సేకరణకు సంబంధించిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించిన విషయాన్ని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. బకాయిలు పెట్టి పదేళ్లయినందున తక్షణమే విడుదల చేయాలని ఆయనను కోరారు.

02

# బీజేపీని నమ్మితే అమ్ముడు ఖాయం

- ఆదిలాబాద్‌లోని సీసీసీని అమ్మేందుకు సిద్ధపడటం దుర్మార్గం
- నమ్మి ఓట్లేసినందుకు ఇదేనా మీరిచ్చే బహుమతి
- కార్మికుల ఆవేదన, ఆర్థనాదాలు వినిపించడం లేదా : మాజీ మంత్రి కేటీఆర్



2లో..

కబురు న్యూస్,హైదరాబాద్,మార్చి04:

బీజేపీని నమ్ముకుంటే చివరకు నడీరోడ్డుపై అమ్మేస్తారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. ఆదిలాబాద్‌లోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాని తుక్కు కింద తెగనమ్మేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవడం అత్యంత దుర్మార్గమని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో సీసీఐని పునఃప్రారంభిస్తామని మాటిచ్చి, ఓట్లు, సీట్లు దండుకుని చివరికి స్క్రాప్ కింద అమ్మేస్తారా అంటూ నిలదీశారు. సీసీఐపైనే కోటి ఆశలు పెట్టుకుని ఉద్యోగులు, కార్మికులు చేస్తున్న నిరసనలు కేంద్ర ప్రభుత్వానికి కనిపించడం లేదా? వారి ఆర్థనాదాలు వినిపించడం లేదా మండిపడ్డారు. ఎంతో విలువైన యంత్ర పరికరాలను పాత ఇనుప సామాన్ల కింద లెక్కకట్టి ఆన్‌లైన్‌లో టెండర్లు పిలవడం, సీసీఐ సంస్థ గొంతు కోయడమేనన్నారు. నిర్మాణ రంగంలో సిమెంటుకున్న డిమాండ్ దృష్ట్యా సీసీఐని ప్రారంభించి కార్మికులను కాపాడాలని బీఆర్ఎస్ పదుల సార్లు కేంద్రమంత్రులకు మొరపెట్టుకున్నా కనికరించకపోవడం ఆదిలాబాద్‌కు వెన్నుపోటు పొడవడమేనని చెప్పారు. 772 ఎకరాల భూమి, 170 ఎకరాల్లో టౌన్ షిప్, 48 మిలియన్ లైమ్ స్టోన్ నిల్వలతో సకల వనరులున్న సంస్థను అంగడి సరుకుగా మార్చేసిన కేంద్రానికి ఉద్యోగులు, కార్మికుల గోస తగలక మానదన్నారు. ఈ అనాలోచిత నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకునే దాకా కార్మికులతో కలిసి ఉద్యమిస్తాం.. సంస్థ పరిరక్షణ కోసం ఎంతవరకైనా పోరాడతామని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలకు ప్రోత్సాహం అందించి వాటిని ఆదుకోవాల్సిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అండగా నిలుస్తున్నది. అస్మదీయులకు ప్రభుత్వ సంస్థలను కట్టబెడుతూ ఉద్యోగులను రోడ్డుపాలు చేస్తున్నది.

## తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం.. 400 ఎకరాల వేలంపాట



కబురు న్యూస్,హైదరాబాద్,మార్చి04:
తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గచ్చిబౌలిలో 400 ఎకరాల వేలంపాటకు నోటిఫికేషన్ విడుదల చేసింది. కన్సల్టెంట్ నియామకానికి టెండర్లు పిలిచింది. ఈ నెల 15 వరకు బిడ్ దాఖలుకు గడువు ఇచ్చింది.కాగా, భూముల అమ్మకానికి రేవంత్ సర్కార్ కుట్రలు చేస్తోందంటూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే, హరీశ్‌రావు ఆరోపించారు. రూ. 30 వేల కోట్ల విలువైన భూములు అమ్మేందుకు యత్నిస్తున్నారు. నాడు భూములు అమ్మొద్దని రేవంత్ సుద్దులు చెప్పారు.



## ఈ నెల 6న తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం

కబురు న్యూస్,హైదరాబాద్,మార్చి04:
ఈ నెల 6న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. మధ్యాహ్నం 2 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గం సమావేశం కానుంది. బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ తదితర అంశాలపై నిర్ణయాలు తీసుకోనున్నారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి దిల్లీకి వెళ్లి ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. పలు ప్రాజెక్టులపై చర్చించారు. వాటిపై కూడా కేబినెట్‌లో చర్చ జరిగే అవకాశముంది.



2లో..

## పులిపిల్లలతో సరదాగా గడిపిన ప్రధాని

- పాలుపట్టి వాటితో ప్రేమ ప్రకటించిన మోడీ
- వంతారాలో పర్యటించి వివరాలు తెలుసుకున్న ప్రధాని

కబురు న్యూస్,జామ్‌నగర్,మార్చి04:
పులిపిల్లలతో ప్రధాని మోడీ సరదాగా గడిపారు. వాటికి పాలు పట్టి తన ప్రేమను చాటారు. వంతారాలో పునరావాసం పొందుతున్న వివిధ జాతుల జంతువులతో ప్రధాని సన్నిహితంగా మెలిగారు. అక్కడ సింహాల పిల్లలకు , జిరాఫీలకు ఆహారం అందించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. గాయపడిన, ఇబ్బందుల్లో ఉన్న జంతువులను సంరక్షించే లక్ష్యంతో 'వంతారా' కార్యక్రమాన్ని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, రిలయన్స్ ఫౌండేషన్ డైరెక్టర్ అనంత్ అంబానీ ప్రారంభించారు.

## వ్యవసాయంపై అవగాహనలేని సీఎం

- పంటలు ఎండుతున్నా.. చీమకుట్టినట్టుగా లేదు
- రైతు బీమా పథకానికి ఎగనామం
- గతంలో బాధిత కుటుంబాలకు బీఆర్ఎస్ అండ : మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి




2లో..

కబురు న్యూస్,హైదరాబాద్,మార్చి04:
వ్యవసాయంపై అసలు సీఎం రేవంత్‌రెడ్డికి కొంచెం కూడా అవగాహన లేదని, అందుకే పంటలు ఎండుతున్నా.. చీమకుట్టినట్టుగా లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత నిరంజన్ రెడ్డి మండిపడ్డారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో నిరంజన్ రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి రైతు ఏ కారణం చేత మరణించినా రూ.5 లక్షల పరిహారం అందించే పథకం రైతు బీమా.. రైతు చనిపోయిన ఏడు పని దినాలలో రైతు కుటుంబానికి పరిహారం అందేదన్నారు. ప్రపంచంలోనే అత్యుత్తమ పథకాలలో ఒకటి రైతు బీమా, రైతుబంధు అని యూఎన్‌ఓకు చెందిన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ సంస్థ





## మహిళా సంఘాలకు ఆర్టీసీ అద్దె బస్సులు.. ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

కబురు న్యూస్,హైదరాబాద్,మార్చి04:
ఆర్టీసీ అద్దె బస్సులపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మహిళా సంఘాలకు ఆర్టీసీ అద్దె బస్సులను కేటాయిస్తూ ప్రభుత్వం మంగళవారం(మార్చి 4, 2025) ఉత్తర్వులు జారీ చేసింది.



2లో

## ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై సుప్రీంలో విచారణ.. ప్రతివాదులకు నోటీసులు



మిగతాది 2లో

## ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం.. సహాయక చర్యల్లో కీలక పురోగతి

తెలుగు దినపత్రిక RNI APTEL/1999/00110
కబురు
KABURU TELUGU DAILY

## సంపాదకీయం

# వైట్‌హౌస్ రియాలిటీ షో!



రోజులన్నీ ఒకేలా ఉండవు. ఈ పరమ సత్యం వైట్‌హౌస్ వేదికగా, ప్రపంచ మాధ్యమాల సాక్షిగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి సంపూర్ణంగా అర్థమైవుంటుంది. హెూంవర్క్ ఎగ్గొట్టిన కుర్రాడిని మందలించినట్టు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ విరుచుకుపడుతుంటే జెలెన్‌స్కీ సంజాయిషీ ఇస్తూనే, అవకాశం చిక్కినప్పుడల్లా తన ఆత్మగౌరవాన్ని కాపాడుకునే ప్రయత్నం చేశారు.ఆయన దయనీయ స్థితిని ప్రత్యక్షంగా తిలకించిన సాధారణ ప్రజానీకం సరే... అంతర్జాతీయంగా చిన్నా పెద్దా దేశాధినేతలందరూ విస్మయపడ్డారు. కాస్త వెనక్కు వెళ్తే జరిగిందంతా వేరు. గత మూడేళ్లుగా ఆయనకు ఎక్కడికెళ్లినా రాజలాంఛనాలు! అమెరికన్ కాంగ్రెస్‌లోనూ, పాశ్చాత్య దేశాల పార్లమెంట్లలోనూ, అవార్డు ప్రదానోత్సవాల్లోనూ, న్యూయార్క్ స్టాక్ ఎక్ఛ్సేంజ్‌లోనూ ఆయనకు సాదర స్వాగతాలు!! ఆయన కోరకుండానే మారణాయుధాలూ, యుద్ధ విమానాలూ, డాలర్లూ పెద్దయెత్తున వచ్చిపడ్డాయి. వాటి విలువ ట్రంప్ అంటున్నట్టు 35,000 కోట్ల డాలర్లా, జెలెన్‌స్కీ సవరించినట్టు 11,200 కోట్ల డాలర్లా అన్నది ముంముందు తేలుతుంది. చిత్ర మేమంటే... ఆయనతో అమర్యాదకరంగా వ్యవహరిస్తున్న ట్రంప్‌ను పల్లెత్తు మాట అనని మీడియా, సూట్‌కు బదులు టీ షర్ట్ వేసుకురావటం అగ్రరాజ్యాధినేతను అవమానించినట్టేనని జెలెన్‌స్కీకి హితబోధ చేసింది! ట్రంప్ తీరు దౌత్యమర్యాదలకు విఘాతమనీ, వర్ధమాన దేశాధినేతను కించపరుస్తూ, ఆధిపత్యం చలాయిస్తూ మాట్లాడటం సరికాదనీ వస్తున్న వాదనలు ముమ్మాటికీ సమర్థించదగినవే. కానీ అమెరికా వ్యవహార శైలి గతంలో కూడా భిన్నంగా లేదు. మర్యాదలివ్వటం మాట అటుంచి గిట్టని పాలకులను పదవీచ్యుతుల్ని చేయటం, తిరుగుబాట్లకు ప్రోత్సహించటం రివాజు. కాకపోతే ట్రంప్ బహిరంగంగా ఆ పని చేశారు. అమెరికా చరిత్రనూ, పాశ్చాత్య దేశాల తీరుతెన్నులనూ చూస్తే ఎన్నో ఉదాహరణలు దొరుకుతాయి. 1946–49 మధ్య గ్రీస్‌లో రాచరిక నియంతృత్వంపై చెలరేగిన తిరుగుబాటును అణచటానికి అప్పటి అమెరికా అధ్యక్షుడు ట్రూమన్ సైన్యాన్ని తరలించారు. క్యూబా, చిలీ, వియత్నాం, ఇరాన్ వగైరాల్లో ప్రభుత్వాలను కూలదోసి తనకు అనుకూలమైనవారిని ప్రతిష్ఠించేందుకు అమెరికా ఎన్ని ప్రయత్నాలు చేసిందో తెలుసుకుంటే దిగ్భ్రాంతి కలుగుతుంది. ప్రచ్ఛన్న యుద్ధకాలంలో మనల్ని చీకాకు పరిచేందుకు పాకిస్తాన్‌లో సైనిక తిరుగుబాట్లకు ఉసి గొల్పింది అమెరికాయే. ప్రభుత్వాల కూల్చివేతకు క్యూబాలోనూ, ఇతరచోట్లా పన్నిన పథకాలను రిటైర్డ్ సీఐఏ అధికారులు ఏకరువు పెట్టారు. ఈ పరంపరలో పాశ్చాత్య దేశాలు అమెరికాతో కలిసి కొన్నీ, సొంతంగా కొన్నీ చేశాయి. మన దేశంలో దాదాపు 200 ఏళ్లు అధికారం చలాయించి ఇక్కడి సంపదను బ్రిటన్ కొల్లగొట్టింది.ఆ దేశమే 1982లో ఫాక్‌ల్యాండ్ ద్వీపసముదాయం కోసం అర్జెంటీ నాపై యుద్ధం చేసి ఆక్రమించింది. ఇంకా 1990–91 నాటి గల్ఫ్ యుద్ధం, 1992–95 మధ్య కొన సాగిన బోస్నియా యుద్ధం, 1999లో కొసావో యుద్ధం, 2001లో ఉగ్రవాదంపై యుద్ధం పేరుతో మొదలెట్టి 2021 వరకూ సాగించిన అఫ్గాన్ యుద్ధం, 2003–2011 మధ్య సాగిన ఇరాక్ యుద్ధం, 2011లో జరిగిన లిబియా దురాక్రమణ... ఇవన్నీ అమెరికా–పాశ్చాత్య దేశాలు 'నాటో' ఛత్ర ఛాయలో సాగించిన యుద్ధాల్లో కొన్ని. ఈ దేశాల్లో మానవ హక్కుల హననం జరుగుతున్నదనీ, ప్రభుత్వాలు నియంత పోకడలు పోతున్నాయనీ సంజాయిషీ ఇచ్చారు. కానీ అక్కడ పౌరులు లేరా... వారు తిరగబడలేరా?వాదోపవాదాల మధ్యన జెలెన్‌స్కీని ఉద్దేశించి 'మీ దగ్గర పేకముక్కలు అయిపోయాయి' అన్నారు ట్రంప్. అది వాస్తవం. ఒక వ్యంగ్యచిత్రకారుడు ఆ ఉదంతంపై వేసిన కార్టూన్ మాదిరే ఆయన్ను ఇన్నాళ్లూ అమెరికా, పాశ్చాత్య దేశాలు పేకమేడ ఎక్కించాయి. మారిన పరిస్థితులను జెలెన్‌స్కీ గ్రహించలేకపోతున్నారు. ఒక సార్వభౌమాధికార దేశంపై మరో దేశం విరుచుకుపడటం, దురాక్రమించటం, జనావాసాలను ధ్వంసం చేయటం ముమ్మాటికీ నేరం. ఉక్రెయిన్ విషయంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆ తప్పు చేశారు. కానీ అందుకు తన చర్యల ద్వారా దోహదపడింది జెలెన్ స్కీయే. ఈ పోకడలు నివారించాలనీ, ఆయనకు మద్దతునీయటంకాక, చర్చల ద్వారా పరిష్కరించు కొమ్మని నచ్చజెప్పాలనీ పుతిన్ కోరినప్పుడు అమెరికా, పాశ్చాత్య దేశాలు ముఖం చాటేశాయి. ట్రంప్ తన పూర్వాశ్రమంలో రియాలిటీ షోలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచేవారు. ఇప్పుడు వైట్ హౌస్ ఉదంతం ఆ మాదిరి ప్రదర్శనే. తాను పుతిన్‌తో చేతులు కలపటం సరైందేనని అమెరికా ప్రజా నీకం అనుకునేలా చేయటమే ట్రంప్ లక్ష్యం. అది నెరవేరిందో లేదోగానీ ఉక్రెయిన్ కోసం పాశ్చాత్య దేశాలు ఏకమవుతున్న సూచనలు కనబడుతున్నాయి.సైన్యాన్ని కూడా తరలిస్తామంటున్నాయి. కానీ జెలెన్‌స్కీ ఒక సంగతి గ్రహించాలి. ఎవరి మద్దతూ ఉత్తపుణ్యానికి రాదు. ఉక్రెయిన్ నేల ఒడిలో నిక్షిప్తమైవున్న అపురూప ఖనిజాలు, ఇతర ప్రకృతి సంపదపైనే ఎవరి దృష్టి అయినా. ఇవాళ మద్దతు నిస్తామంటున్న పాశ్చాత్య దేశాలు రేపన్నరోజు అమెరికాతో రాజీపడితే ఉక్రెయిన్‌కు మళ్లీ సమస్యలే. నిన్నటివరకూ మద్దతిచ్చిన అమెరికా స్వరం మార్చడాన్ని చూసైనా యూరప్ దేశాలను నమ్ముకుంటే ఏమవుతుందో జెలెన్‌స్కీ గ్రహించాలి. రష్యాతో శాంతి చర్చలకు వేరే ప్రత్యామ్నాయం లేదు. ఇకపై స్వతంత్రంగా వ్యవహరించగలమన్న అభిప్రాయం కలగజేస్తే, దురాక్రమించిన భూభాగాన్ని వెనక్కివ్వాలని రష్యాను డిమాండ్ చేస్తే జెలెన్‌స్కీకి అన్నివైపులా మద్దతు లభిస్తుంది.

# వ్యవసాయంపై అవగాహనలేని సీఎం

మొదటిపేజీ తరువాయి

ప్రకటించిందని గుర్తుచేవారు. రైతు బీమా పథకం ప్రవేశపెట్టిన తరువాత డిసెంబర్ 4, 2023 బీఆర్ఎస్ ప్రభుత్వం దిగిపోయే వరకు రాష్ట్రంలో 1,18,197 మంది రైతులు మరణించగా రూ.5,909.85 కోట్లు ఆ రైతు కుటుంబాలకు పరిహారంగా అందించడం జరిగిందని పేర్కొన్నారు. రైతు బీమా పథకం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.6122.65 కోట్లు ఎల్ఐసీకి ప్రీమియంగా చెల్లించిందని తెలిపారు. ఏడాదికి రూ.1500 కోట్లకు గాను రెండో విడత కాంగ్రెస్ ప్రభుత్వం రూ.750 కోట్ల ప్రీమియం చెల్లించని కారణంగా ఏడు వేల పైచిలుకు కుటుంబాల పరిహారం పెండింగ్‌లో ఉన్నాయని నిరంజన్ రెడ్డి తెలిపారు. 15 నెలలలో 440కి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరెంటు రాదు, నీళ్లు రావు, రైతుబంధు రాదు, రైతు బీమా ప్రీమియం చెల్లించరు.. మరి కాంగ్రెస్ ప్రభుత్వం ఏమిస్తున్నది? కాంగ్రెస్ అభయహస్తంలో వ్యవసాయానికి రూ.3 లక్షల వడ్డీ లేని రుణం అన్నారు. 24 గంటల కరెంటు అన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ మొదలే పెట్టలేదు. వ్యవసాయ అనుబంధ రంగాలలో ఖాళీలను భర్తీ చేయలేదని విమర్శించారు. అసైన్డ్ పోడు భూములకు పట్టా భూములతో సమానంగా పరిహారం అని దాని ఊసెత్తడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను కుదువపెట్టి రైతు భరోసా కోసం అని రూ.10 వేల కోట్లు తెచ్చి రెండు నెలలు అవుతుంది.. మూడెకరాల వరకు రైతులకు కూడా రైతు భరోసా నిధులు పడలేదు. మూడెకరాల వరకు రైతు భరోసా ఇచ్చామని వ్యవసాయ మంత్రి చెబుతుంటే.. మూడెకరాల వరకు రైతులకు డబ్బులు వేయాలని ఉప ముఖ్యమంత్రి చెబుతున్నారు. పది వేల కోట్లు తెచ్చిన ప్రభుత్వానికి రూ.750 కోట్లు రైతు బీమా ప్రీమియం చెల్లించడానికి ప్రభుత్వానికి ఎందుకు మనసు రావడంలేదు? ఇది రైతు అనుకూల ప్రభుత్వమా? అని నిరంజన్ రెడ్డి ప్రశ్నించారు. రైతు బీమాను ప్రభుత్వం నీరు గార్చే ప్రయత్నం చేస్తుంది. రైతులు కష్టపడి పంటలు పండిస్తుంటే సాగునీళ్లు లేక, కరెంటు లేక రైతుల పొలాలు ఎండుతున్నాయి, పశు వులకు మేతగా మారుతున్నాయి, రాష్ట్రంలో అనేక సమస్యలతో రైతులు సతమతం అవుతున్నారు. యాసంగి సీజన్ మొదలయ్యే సమయానికి సమీక్ష చేయడంలో ప్రభుత్వం విఫలమయింది. రాష్ట్ర ప్రభుత్వ అన్ని వైఫల్యాలకు కారణం కేసీఆర్ అని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పుకుంటుంది. రైతులు పంటలు వేసుకున్న తర్వాత రైతు కమీషన్ చైర్మన్ కోదండరెడ్డితో రైతులు పంటలు వేసుకోవద్దు అని చెప్పించారు. ఆ తర్వాత మళ్లీ ముఖ్యమంత్రి, నీటి పారుదల శాఖా మంత్రి చెప్పకుండా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి గారితో సాగునీళ్లకు కొరత లేదని చెప్పించారు. మరి నీటికి, కరెంటుకు సమస్య లేకుంటే రైతులు దేనికి ఆందోళన చెందుతున్నట్లు ప్రభుత్వం సాగునీటి మీద సమీక్ష ఎందుకు చేయలేదు? అని నిరంజన్ రెడ్డి నిలదీశారు.

## బీజేపీని నమ్మితే అమ్ముడు ఖాయం

మొదటిపేజీ తరువాయి

కార్పొరేట్‌కు అప్పగించే పనుల్లో భాగంగా ఆదిలాబాద్ సిమెంటు కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ)ని ప్రభుత్వం అమ్మకానికి పెట్టేందుకు సిద్ధమైంది. ఈ మేరకు మూతబడిన సీసీఐ యంత్ర సామగ్రిని స్క్రాప్ కింద వేలం వేయడానికి టెండర్లను ఆహ్వానించింది. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం సిమెంటుకు డిమాండ్ భారీగా ఉంది. ఆదిలాబాద్ సిమెంటు పరిశ్రమను ప్రారంభించడానికి అన్ని వనరులు ఉన్నాయి. సీసీఐని ప్రారంభిస్తే 2,500 మందికి ప్రత్యక్షంగా, మరో 2,500 మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుంది. సీసీఐని ప్రారంభించాలని గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రానికి పలుమార్లు విజ్ఞప్తి చేసింది. పరిశ్రమ పునఃప్రారంభానికి రాయితీలు కల్పిస్తామని హామీ ఇచ్చింది. రాష్ట్ర పరిశ్రమల శాఖ మాజీ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే జోగు రామన్నతో పాటు ఇతర బీఆర్ఎస్ నేతలు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, అప్పటి పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్రనాథ్ పాండేలను కలిసి అనేకసార్లు వినతిపత్రాలు అందజేశారు. కానీ, మోదీ సర్కారు స్పందించలేదు. ఈ నేపథ్యంలో తాజాగా వేలాది మంది ఉపాధిని పట్టించుకోకుండా, స్థానికుల మనోభావాలను లెక్కచేయకుండా పరిశ్రమను కేంద్రం ప్రభుత్వం విక్రయించేందుకు చర్యలు చేపట్టింది. కేంద్రంలోని మోదీ సర్కారు ఈ పరిశ్రమను అమ్మేందుకు మూడేండ్ల నుంచి ప్రయత్నాలు చేస్తున్నది. మొదటిసారి స్క్రాప్ ఈ–వేలంలో భాగంగా 2022 మే 5న ఆన్‌లైన్‌లో బిడ్లను ఆహ్వానించింది. కేంద్రం నిర్ణయానికి వ్యతిరేకంగా బీజేపీ మినహా అన్ని పార్టీల నాయకులు అఖిలపక్షంగా ఏర్పడి ఆందోళనలు చేపట్టారు. దీంతో అప్పట్లో వేలం ప్రక్రియ నిలిచిపోయింది. మరోసారి ఈ టెండర్లను కేంద్రం పిలిచింది. ఈ నెల 7 నుంచి టెండర్లను ఆన్‌లైన్‌లో దాఖలు చేసుకోవచ్చని సూచించింది. మూతబడిన ఆదిలాబాద్ సిమెంటు పరిశ్రమలో 71 పరికరాలకు సంబంధించి వేలం ప్రారంభ ధర రూ.43.30 కోట్లు ఉంటుందని అధికారులు తెలియజేశారు. దీంతో జిల్లా వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## మహిళా సంఘాలకు ఆర్టీసీ అద్దె బస్సులు.. ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

మొదటిపేజీ తరువాయి

తొలి విడతలో 150 మహిళా సంఘాలకు బస్సులు కేటాయిస్తున్నట్లు ఈ ఉత్తర్వుల్లో ప్రభుత్వం స్పష్టం చేసింది. త్వరలో మిగిలిన సంఘాలకు 450 ఆర్టీసీ అద్దె బస్సులు కేటాయించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

బస్సుల కొనుగోలుకు బ్యాంకు గ్యారంటీ ఇవ్వాలని రేవంత్ సర్కార్ డిసైడ్ అయింది. టీజీఎస్ఆర్టీసీ ఒక్కో బస్సుకు 77,220 రూపాయల అద్దె చెల్లించనుంది. మన దేశంలోనే తొలిసారి మహిళా సంఘాలకు అద్దె RTC బస్సులు కేటాయించడం గమనార్హం. తొలి విడతలో ప్రయోగాత్మకంగా రెండు జిల్లాల్లో మహిళా సంఘాలకు ఆర్టీసీ అద్దె బస్సులను కేటాయించనున్నారు.

సీఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లా మహబూబ్ నగర్, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్? సొంత జిల్లా కరీంనగర్?లను ఎంపిక చేశారు. మొదటి విడతలో 150 బస్సులను మహిళా సంఘాల ద్వారా కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వాటి నిర్వహణ బాధ్యతల కోసం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు.ఆర్టీసీ బస్సుల కొనుగోలుకు అయ్యే ఖర్చు, వచ్చే ఆదాయం, నిర్వహణ ఖర్చు తదితర అంశాలన్నింటితో కూడిన సమగ్ర నివేదికను సిద్ధం చేసి ప్రభుత్వానికి అధికారులు సమర్పించారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు తుది నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బస్సుల సంఖ్య పెంచాలని డిమాండ్ ఉంది. ఈ క్రమంలో మహిళా సంఘాలకు ఉపాధి కల్పించడంతోపాటు వారు కొనుగోలు చేసిన బస్సులను హైర్ చేసుకోవాలని ఆర్టీసీ నిర్ణయించింది.

## పులిపిల్లలతో సరదాగా గడిపిన ప్రధాని

మొదటిపేజీ తరువాయి

వన్యప్రాణుల రక్షణ, పునరావాసం, సంరక్షణ కేంద్రమైన ఈ వంతారాను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మంగళవారం సందర్శించారు. ప్రధాని మోదీ ప్రస్తుతం తన సొంత రాష్ట్రం గుజరాత్‌లో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. సోమవారం ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం సందర్భంగా గిర్ అడవుల్లో సఫారీకి వెళ్లారు. మంగళవారం జామ్‌నగర్‌లోని వంతారాను సందర్శించారు. వన్యప్రాణుల ఆసుపత్రిని, జంతువుల కోసం ఏర్పాటు చేసిన పశువైద్య సౌకర్యాలను వీక్షించారు. అంతే కాకుండా వైల్డ్‌లైఫ్ అనస్థీషియా, కార్డియాలజీ, నెఫ్రాలజీ, ఎండోస్కోపీ, డెంటిస్ట్రీ, ఇంటర్నల్ మెడిసిన్ మొదలైన అనేక విభాగాలను కూడా పరిశీలించారు. దేశ, విదేశాల్లో గాయపడిన, ప్రమాదంలో చిక్కుకున్న జంతువులను కాపాడి, చికిత్స చేసి, సంరక్షించి, పునరావాసం కల్పించడం 'వంతారా' ముఖ్య లక్ష్యం. వంతారా అనేది కృత్రిమ అడవి. గుజరాత్‌లోని జామ్‌నగర్ రిలయన్స్ రిఫైనరీ కాంప్లెక్స్‌లో 3 వేల ఎకరాల్లో ఇది ఉన్నది. ఈ అడవిలో 25 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏనుగుల కోసం ప్రత్యేకంగా దవాఖాన ఉంది. ఇది ప్రపంచంలోనే అతిపెద్దది. ఇందులో దాదాపు 2వేల వన్యప్రాణులను సంరక్షిస్తున్నారు. వేల సంఖ్యలో ఉద్యోగులు కూడా పనిచేస్తున్నారు.

## ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం.. సహాయక చర్యల్లో కీలక పురోగతి

మొదటిపేజీ తరువాయి

**దోమలపెంట:**
నాగర్ కర్నూల్ జిల్లాలోని శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) సొరంగ వద్ద సహాయక చర్యల్లో కీలక ముందడుగు పడింది. ఇటీవల 14వ కిలోమీటరు వద్ద సొరంగం పైకప్పు ఒక్కసారిగా కూలిన ఘటనలో 8 మంది సిబ్బంది అందులో చిక్కుకుపోయిన విషయం తెలిసిందే. ప్రమాదం జరిగిన 11 రోజులకు టన్నెల్‌లోని కన్వేయర్ బెల్ట్‌ను సాంకేతిక సిబ్బంది పునరుద్ధరించారు. కన్వేయర్ బెల్ట్ పనిచేస్తుండటంతో బురద, మట్టి తొలగింపు పనులు వేగవంతం కానున్నాయి.200 అడుగులు పేరుకుపోయిన మట్టి, బురద, రాళ్లు, సెగ్మెంట్, టీబీఎం శిథిలాలు ఉండటంతో ఇప్పటి వరకు ఆ 8మంది జాడ గుర్తించలేకపోయారు. దాదాపు 6 వేల క్యూబిక్ మీటర్ల పూడికను తొలగించాల్సి ఉందని అధికారులు అంచనా వేశారు.

## ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై సుప్రీంలో విచారణ.. ప్రతివాదులకు నోటీసులు

పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు లో విచారణ జరిగింది. ఇప్పటి వరకు కోర్టు నుంచి తమకు నోటీసులు రాలేదని ప్రతివాదుల తరఫు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. ప్రతివాదుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. రాష్ట్ర ప్రభుత్వం, అసెంబ్లీ కార్యదర్శి సహా ప్రతివాదులందరికీ నోటీసులు జారీ చేసింది. పిటిషన్‌పై తదుపరి విచారణ ఈనెల 25కు వాయిదా వేసిన ధర్మాసనం.. 25లోపు కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది.

## తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం.. 400 ఎకరాల వేలంపాట

మొదటిపేజీ తరువాయి

పీసీసీ చీఫ్‌గా ఒక మాట.. సీఎం రాగానే మరో మాట అంటూ హరీష్‌రావు దుయ్యబట్టారు.ప్రభుత్వ భూములంటే పెద్దలిచ్చిన ఆస్తి అని, తెలంగాణ జాతి సంపద అని, ఆ భూములను అమ్మితే భవిష్యత్తులో స్మశానాలు నిర్మించాలంటే కూడా భూమి లేకుండా పోతుందంటూ పీసీసీ అధ్యక్షుడి హెూదాలో రేవంత్ మొసలి కన్నీరు కార్చారని హరీష్‌రావు గుర్తుచేశారు. ప్రభుత్వ భూములను అమ్మబోంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించి మూడు నెలలైనా గడవక ముందే విలువైన ఆస్తులను కొల్లగొట్టేందుకు కుట్ర పన్నారంటూ కాంగ్రెస్ సర్కార్‌ని హరీష్‌రావు నిలదీశారు.

## రూ. 1,891 కోట్ల బకాయిలు చెల్లించండి..

మొదటిపేజీ తరువాయి

ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన కింద 2021 మే నుంచి 2022 మార్చి వరకు సరఫరా చేసిన అదనపు బియ్యం, 2022 ఏప్రిల్ నెలలో సరఫరా చేసిన బియ్యానికి సంబంధించిన ఉత్తర్వులను ధ్రువీకరించుకొని.. వీటికి సంబంధించిన బకాయిలు రూ.343.27 కోట్లను విడుదల చేయాలని కేంద్ర మంత్రికి సీఎం, మంత్రి విజ్ఞప్తి చేశారు. అలాగే 2021 జూన్ నుంచి 2022 ఏప్రిల్ వరకు నాన్ ఎన్ఎఫ్ఎస్ఎ (నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్) కింద పంపిణీ చేసిన బియ్యానికి సంబంధించిన బకాయిలు రూ.79.09 కోట్లు వెంటనే విడుదల చేయాలని వారు కోరారు. సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) గడువు నెల రోజుల చొప్పున కాకుండా కనీసం నాలుగు నెలలు పొడిగించాలని, అప్పుడే సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తవని వీరు.. కేంద్ర మంత్రి జోషికి తెలియజేశారు.

### 4వేల మెగావాట్ల సోలార్ విద్యుత్..

రాష్ట్రానికి పీఎం కుసుమ్ కింద గతంలో ఇచ్చిన 4 వేల మెగావాట్ల సోలార్ విద్యుదుత్పత్తికి అనుమతులు పునరుద్ధరించాలని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గతంలో నాలుగు వేల మెగావాట్లకు అనుమతులిచ్చి.. తరువాత రోజుల్లో దాన్ని కేంద్రం వెయ్యి మెగావాట్లకు కుదించిన విషయాన్ని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలో మహిళా సంఘాల ద్వారా సోలార్ విద్యుదుత్పత్తిని ప్రోత్సహిస్తున్న విషయాన్ని కేంద్ర మంత్రికి వివరించారు.పౌరసరఫరాల శాఖ బకాయిల విడుదల, 4వేల మెగావాట్ల మంజూరు సోలార్ విద్యుత్ అనుమతుల పునరుద్ధరణ విషయాల్లో కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు.

తెలుగు దినపత్రిక
కబురు
KABURU TELUGU DAILY
బుధవారం మార్చి 05 2025

# మదీనా కాలనీలో ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటుచేసిన అధికారులు



కబురు న్యూస్ బాన్సువాడ మార్చి 04

బాన్సువాడ పట్టణంలోని మదీనా కాలనీలో 100%ఖవాూ% ట్రాన్స్ఫార్మర్ను ఏర్పాటు చేసి మంగళవారం విద్యుత్ శాఖ డివిజనల్ అధికారి ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీలో లో వోల్టేజ్ సమస్యను తీర్చినందుకు కాలనీవాసులు విద్యుత్ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ సంతోష్ కుమార్, బీర్మల్, లైన్ ఇన్స్పెక్టర్లు రాజేంద్రప్రసాద్, బలరాం, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బాన్సువాడలో బొజ్జ భూమా గౌడ్ కు నివాళులర్పించిన కార్మికులు



కబురు న్యూస్ బాన్సువాడ మార్చి 04

వ్యవసాయ కార్మికులు, సివిల్ సప్లై హమాలీల సమస్యల పరిష్కారానికి కామ్రేడ్ బొజ్జ భూమా గౌడ్ చేసిన సేవలు ఎనలేనివని సిపిఐ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ దుబాస్ రాములు అన్నారు. బోజ్జా భూమా గౌడ్ నాలుగో వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దుబాస్ రాములు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం అలుపెరగని పోరాటం చేసిన భూమా గౌడ్ కార్మికుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జ్ దుబాస్ రాములు, కార్మికులు సాయిలు, హన్మాండ్లు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# బాన్సువాడలో ఘనంగా విద్యుత్ లైన్మెన్ల దినోత్సవం..



కబురు న్యూస్ బాన్సువాడ మార్చి 04


బాన్సువాడ పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయ ఆవరణలో మంగళవారం విద్యుత్ లైన్మెన్ల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యుత్ ఉద్యోగులు ఉద్యోగ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డివిజనల్ విద్యుత్ శాఖ అధికారి ప్రభాకర్ ఫోర్ మెన్,లైన్మెన్, ఎస్ ఎల్ ఐ, ఎల్ఐ, ఏఎల్ఎంలకు శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ, రూరల్ ఏఈలు సంతోష్ కుమార్, అనిల్ కుమార్, విద్యుత్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు

# అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు సుఖశాంతులతో ఉండాలి

మాజీ శాసనసభ్యులు గణేష్ గుప్తా బిగాల...

కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,మార్చ్ 04 :





నిజామాబాద్ నగర ప్రజలపై అమ్మవారి ఆశీస్సులు ఉండాలని,సుఖశాంతులతో వర్ధిల్లాలని అర్బన్ మాజీ శాసన సభ్యులు బిగాల గణేష్ గుప్తా అన్నారు.నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని వినాయక్ నగర్ షిర్డీ సాయి నగర్ లో శ్రీ మావురాల రేణుక ఎల్లమ్మ దేవస్థానం విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడారు.కాలనీవాసులు అందరూ కలిసికట్టుగా ఉండి,ఈ ఆలయాన్ని నిర్మించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.నగర ప్రజలకు ఎలాంటి కష్టం రాకుండా సుఖశాంతులతో ఉండాలని అమ్మవారిని కోరినట్లు తెలిపారు.అలాగే జిల్లావ్యాప్తంగా ఉన్న రైతుల పాడి పంటలు పండి లాభాలతో వారి ముఖాల్లో ఆనందాన్ని చూడాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ నగర మేయర్ శ్రీమతి దండు నీతూ కిరణ్,మాజీనూడ చైర్మన్ చామకూర ప్రభాకర్ రెడ్డి,నగర అధ్యక్షులు సిర్ప రాజు,సీనియర్ నాయకులు సుదాం రవిచందర్,సత్యప్రకాశ్,తడ్కల్ శ్రీను,శివలింగం గౌడ్,బిఆర్ఎస్ నాయకులు,గౌడ సంఘం,గౌడ కులస్తులు,తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమం కోసం చివరి శ్వాస వరకు పని చేస్తా

– భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ అధ్యక్షుడు కొండెల సాయిరెడ్డి...

కబురు న్యూస్,నిజామాబాద్ మార్చి 04 :

ఊహ తెలిసిన నాటి నుంచి రైతుల శ్రేయస్సు కోసమే పనిచేస్తున్నానని,నా చివరి శ్వాస వరకు రైతు సంక్షేమం కోసమే పని చేస్తానని భారతీయ కిసాన్ సంఘ్ నూతన జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన కొండల సాయిరెడ్డి వ్యాఖ్యానించారు. భారతీయ కిసాన్ సంఘ్ 46వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మారుతీ నగర్ లోని గణేష్ భవన్ లో నూతన జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన కొండల సాయిరెడ్డి ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సాయి రెడ్డి మాట్లాడుతూ కిసాన్ సంఘ్ లో సాధారణ కార్యకర్త స్థాయి నుంచి జాతీయ అధ్యక్షుడి స్థాయికి ఎదిగిన ఈ మొత్తం ప్రయాణం కేవలం వ్యవసాయం,రైతు మరియు వ్యవసాయ అనుబంధ వ్యవస్థలతోనే ముడి పడిపోయిందని తన జీవితం మొత్తంలో రైతు సంక్షేమ తప్ప వేరే లక్ష్యము ఏదీ లేదని తెలిపారు.జాతీయ అధ్యక్షుడిగా ఎన్నిక కావడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని కానీ అదే సమయంలో దేశంలోనే అత్యంత శక్తివంతమైన రైతు సంస్థగా కిసాన్ సంఘ్ ను నిలబెట్టాల్సిన బాధ్యత తన మీద ఉందని అంతేకాకుండా తెలంగాణ రాష్ట్రము,నిజామాబాద్ జిల్లాలోని అన్ని గ్రామాలలో



కమిటీలను ఏర్పాటు చేసి రైతాంగ సమస్యల గురించి పోరాటం చేయటమే లక్ష్యంగా పనిచేస్తామని ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు.సారంగాపూర్ చక్కెర కర్మాగారాన్ని తిరిగి ప్రారంభించడం ద్వారా వెయ్యి మందికి ఉపాధి, పంట మార్పిడి పద్ధతి ద్వారా వేలాది మంది రైతులకు ఉపాధి లభిస్తుందని అందుకోసమే ఆ ఫ్యాక్టరీని తిరిగి తెరిపించటం కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధపడతామని ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో ఫ్యాక్టరీని తిరిగి తెరిపిస్తామని హామీ ఇచ్చినట్లుగా గుర్తు చేశారు.ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా విచ్చేసిన ఆర్ఎస్ఎస్ విభాగ్ ప్రచారక్ నర్రా వెంకట శివకుమార్ మాట్లాడుతూ,రైతు ద్వారానే సమాజంలో పరివర్తన సాధ్యమవుతుందని భూమిని తల్లిగా భావించి పోషించేది రైతు మాత్రమే అని అందుకే రైతును భగవంతుడితో పోలుస్తారని ఆయన తెలిపారు.ప్లాస్టిక్ ను నివారించడం ద్వారా భూమి యొక్క సాంద్రతను కాపాడవచ్చని అంతేకాకుండా సేంద్రియ వ్యవసాయాన్ని వీలైనంత ఎక్కువమంది ప్రోత్సహించాలని రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని ఆ దిశగా దేశవ్యాప్తంగా ఉన్న నూతన ప్రయోగాలను సాయి రెడ్డి గారి నేతృత్వంలోని కిసాన్ సంఘ కార్యకర్తలు విస్తృత ప్రచారం చేయాలని ఆయన సూచించారు. సమాజంలో ఎన్నో వృత్తులు వ్యవసాయం మీద ఆధారపడి ఉన్నాయని పరిస్థితులు,కాలము,ఆధునికత ఎన్ని వచ్చినా వ్యవసాయాన్ని విడిచి ప్రాణికోటి జీవించలేదు కాబట్టి ప్రతి ఒక్కరం వ్యవసాయాన్ని గౌరవించడంతోపాటు భూమిని కాపాడాల్సిన బాధ్యతను స్వీకరించాల్సిన అవసరం ఉందని ఆయన గుర్తు చేశారు.సాయిరెడ్డి లాంటి వినమ్రత కలిగిన కార్యకర్తలు, సిద్ధాంతాన్ని నమ్ముకొని పనిచేసిన కారణంగా అంచలంచలుగా ఎదిగి జాతీయ అధ్యక్షుడు కావటం గర్వకారణం అని తెలిపారు, రైతాంగం యొక్క సమస్యలు మరియు వ్యవసాయంలో వస్తున్న మార్పులను ప్రకృతికి అనుకూలంగా అనుసంధానం చేసే ప్రక్రియను రైతులకు తెలియజేయాలని ప్రభుత్వాలతో సమన్వయం చేసుకుంటూ అన్నదాతల శ్రేయస్సును కాపాడాలని ఆయన గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో సభాధ్యక్షులు కె.నారయణ రెడ్డి,డి. వాసుదేవరావు,రైతు ఉత్పత్తిదారుల సంఘం స్టేట్ జనరల్ సెక్రటరీ గడ్డం దశరథ్ రెడ్డి,నగర అధ్యక్షులు,భారతీయ కిసాన్ సంఘ్, వ్యవసాయ శాఖ అధికారులు, భారతీయ కిసాన్ సంఘ నాయకులు కార్యకర్తలు వివిధ వ్యవసాయ అనుబంధ సంఘాలు,సహకార సంఘాల సభ్యులు ఆత్మీయులు శ్రేయోభిలాషులు, తదితరులు పాల్గొన్నారు.

# పోచంపాడ్ సోషల్ వెల్ఫేర్ స్కూల్, పీ.హెచ్.సీలను తనిఖీ చేసిన కలెక్టర్







కబురు న్యూస్,నిజామాబాద్,మార్చి 04 :

మెండోరా మండలం పోచంపాడ్ లోని సోషల్ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల/కళాశాలను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు.ముందుగా సాంఘిక సంక్షేమ పాఠశాలలో కిచెన్ కం డైనింగ్ హాల్, స్టోర్ రూం డార్మెటరీలను సందర్శించి బియ్యం,కూరగాయలు,పప్పు దినుసులు,వంట నూనె,ఇతర సరుకుల నాణ్యతను పరిశీలించారు.సరుకుల స్టాక్ రిజిష్టర్ తనిఖీ చేశారు.చుట్టూరా ప్రహరీ గోడతో కూడిన సువిశాలమైన పాఠశాల ఆవరణను గమనించిన కలెక్టర్,ప్లే గ్రౌండ్ గురించి ఆరా తీశారు.అర్ధాంతరంగా నిలిచిపోయిన ల్యాబ్ గదుల నిర్మాణాలను పూర్తి చేయించేందుకు తక్షణమే ప్రతిపాదనలు పంపాలని నిర్వాహకులను ఆదేశించారు.కిచెన్ లో నిరుపయోగంగా ఉన్న స్టీమ్ యూనిట్ ను వినియోగంలోకి తేవాలని,500 పైచిలుకు మంది విద్యార్థినులు కొనసాగుతున్నందున అన్నం,ఇతర ఆహార పదార్థాలు శుచి,శుభ్రతతో చక్కగా వండడానికి ఇది ఉపకరిస్తుందని కలెక్టర్ సూచించారుఅనంతరం కలెక్టర్ పోచంపాడ్ ఆసుపత్రిలోని ఆయా విభాగాలను సందర్శించి,రోగులకు అందిస్తున్న వైద్య సేవల తీరును గమనించారు.అందుబాటులో ఉన్న మందుల స్టాక్,వైద్యులు,సిబ్బంది హాజరును తనిఖీ చేశారు.వివిధ వార్డులను సందర్శించి రోగులకు కల్పిస్తున్న సదుపాయాలను గమనించారు.బ్లడ్ శాంపిల్స్ సేకరిస్తూ,మధుమేహం,టైఫాయిడ్, మలేరియా వంటి వ్యాధుల నిర్ధారణ,వాటి బారిన పడిన వారికి అందిస్తున్న చికిత్సల గురించి అడిగి



తెలుసుకున్నారు.అన్ని రకాల ఔషధాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని వైద్యాధికారులకు సూచించారు.కలెక్టర్ వెంట సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల ఇంచార్జ్ జోనల్ ఆఫీసర్ పూర్ణచందర్,స్కూల్ ప్రిన్సిపాల్ గోదావరి,పీ.హెచ్.సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాకేశ్ తదతరులు ఉన్నారు.

# ఈవీఎం గోడౌన్ ను పరిశీలించిన కలెక్టర్

కబురు న్యూస్,నిజామాబాద్,మార్చి 04 :





జిల్లా కేంద్రంలోని వినాయకనగర్ లో గల ఈవీఎం గోడౌన్ ను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మంగళవారం అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ తో కలిసి పరిశీలించారు.గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోడౌన్ సీల్ ను తెరిచారు.ఈవీఎంలు,బ్యాలెట్ యూనిట్ లు, ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన గదులను క్షుణ్ణంగా పరిశీలించారు.కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ కొనసాగిన మరమ్మతు పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.నాణ్యతతో పనులు జరిగేలా పర్యవేక్షణ చేయాలని పంచాయతీరాజ్ ఈ.ఈ శంకర్ ను ఆదేశించారు.సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించిన కలెక్టర్,అవి నిరంతరం పనిచేసేలా చూడాలన్నారు.ఈవీఎంలు,బ్యాలెట్ యూనిట్లు,ఇతర సామాగ్రికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా గోడౌన్ లోనే పూర్తి స్థాయిలో సదుపాయాలు కలిగి ఉన్న గదుల్లో భద్రపర్చాలని,చెదలు నివారణ కోసం అవసరమైన చోట పెస్ట్ కంట్రోల్ చేయించాలని అధికారులను ఆదేశించారు.పనులను పక్కాగా జరిపించాలన్నారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్,సిబ్బంది సాత్విక్,విజేందర్,అగ్నిమాపక శాఖ అధికారి నర్సింగ్,వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు,అధికారులు ఉన్నారు.

# ఎమ్మెల్సీ గెలుపుతో ఉపాధ్యాయులకు వందనం కార్యక్రమం చేపట్టిన బిజెపి నాయకులు




కబురు న్యూస్ బాన్సువాడ మార్చి 4

ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్ ,అదిలాబాద్, మెదక్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఎన్నికైన మల్క కొమురయ్య ఘన విజయం సాధించినందుకు మంగళవారం బాన్సువాడ బిజెపి నాయకులు ఉపాధ్యాయులకు వందనం పేరుతో బాన్సువాడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు, లెక్చరర్లను, బిజెపి నాయకులు కలిసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో మార్పు మొదలైందని రానున్న స్థానిక సంస్థలు, శాసనసభ ఎన్నికల్లో బిజెపి జెండా ఎగరవేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపు కొరకు కృషి చేసిన వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు అన్నారు. పట్టభద్రుల అభ్యర్థి అంజిరెడ్డి కూడా ఘనవిజయం సాధిస్తారన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి అసెంబ్లీ పట్టభద్రుల ఇన్చార్జ్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కార్యదర్శి శంకర్ గౌడ్, బిజెపి నాయకులు కోణాల గంగారెడ్డి, శ్రీనివాస్, చీకట్ల రాజు, సాయి రెడ్డి, సాయి ప్రసాద్, శివకుమార్, లక్ష్మణ్, రామకృష్ణ, సంతోష్, విజయ్ కుమార్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలను గౌరవించే చోట దేవతలు కొలువై ఉంటారు: సీపీ సుధీర్ బాబు ఐపీఎస్

**- అన్ని రంగాలలోనూ పురుషులతో సమానంగా మహిళలు పోటీపడుతున్నారు**






**కబురు న్యూస్,రంగారెడ్డి జిల్లా మార్చ్ 4:** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాచకొండ కమిషనరేట్ అదేవిధంగా రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు నాగోల్ లోని పిబిఆర్ కన్వెన్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల రాచకొండ పోలీసు మహిళా అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కమీషనర్ శ్రీ సుధీర్ బాబు ఐపీఎస్ మాట్లాడుతూ మహిళల్లో సంకల్ప శక్తి ఎక్కువగా ఉందని, వారు ఏదైనా సాధించగలరని అన్నారు. తమ జీవితంలో ఎన్నోరకాల వివక్షలను ఎదుర్కొంటూ, వారి ప్రతిభను ప్రదర్శించడంలో ఎదురైన అవరోధాలను అధిగమిస్తూ అన్ని రంగాల్లోనూ ఉన్నత స్థాయికి చేరుకుంటున్నారని పేర్కొన్నారు. మన దేశంలో అన్ని రంగాల్లో పురుషుల కంటే మహిళలు మెరుగ్గా రాణిస్తున్నారని, లాయర్లుగా, పోలీసు అధికారులుగా, ఇంజనీర్లుగా, డాక్టర్లుగా, శాస్త్రవేత్తలుగా, విద్యావేత్తలుగా, మరెన్నో ఇతర రంగాల్లో పని చేస్తూ తమ విజ్ఞానాన్ని, నైపుణ్యాన్ని దేశాభివృద్ధికి అందిస్తున్నారని పేర్కొన్నారు. మహిళలను గౌరవించడం మన భారత ఉపఖండంలో ఉన్న గొప్ప విషయం అని, మన దేశంలోనే కాక పొరుగు దేశాలైన శ్రీలంక, బంగ్లాదేశ్ మరియు పాకిస్తాన్ లో కూడా స్త్రీలు అధ్యక్ష, ప్రధాని పదవులు నిర్వహించే స్థాయికి చేరుకున్నారని గుర్తు చేశారు.

మహిళలకు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లోనూ సమాన హక్కులు ఉన్నాయని, మహిళా అధికారులందరూ తమ పూర్తి శక్తితో పని చేయాలని, తమ కలల సాకారం కోసం అహర్నిశలూ పాటుపడాలని సూచించారు. పురుషుల కంటే స్త్రీలకు నిబద్ధత ఎక్కువ అని, రాచకొండ పోలీసు కమిషనరేట్ లో పలు విభాగాల్లో వందల మంది మహిళలు సమర్థవంతంగా పని చేయడం పట్ల కమీషనర్ హర్షం వ్యక్తం చేశారు. రిసెప్షన్ వంటి క్లరికల్ బాధ్యతలు మాత్రమే కాక ఎస్ఓటీ, ట్రాఫిక్, క్రైమ్ వంటి విభాగాల్లో కూడా క్లిష్టమైన బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని, గృహ హింస మరియు వైవాహిక వివాదాలలో బాధితులైన మహిళలకు కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు అనేక రకాల విధులను మహిళా పోలీసు అధికారులు నిర్వహిస్తున్నారని అభినందించారు. మహిళా అధికారులందరూ పోలీసు శాఖలో భాగమై సమాజానికి చేస్తున్న సేవను పేర్కొంటూ, మహిళలు పలు రంగాలలో సాధిస్తున్న విజయాలు రానున్న తరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని, మహిళా అధికారులందరూ ధైర్యంగా ఉండాలని, తమ వృత్తిపరమైన బాధ్యతలను గౌరవంగా నిర్వహించాలని సూచించారు. రాచకొండ కమిషనరేట్ మహిళా సిబ్బంది సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో డీసీపీ మల్కాజీగిరి పద్మజ ఐపీఎస్, డిసిపి యాదాద్రి రాజేష్ చంద్ర ఐపిఎస్, డిసిపి ఎల్బీనగర్ ప్రవీణ్ కుమార్ ఐపిఎస్, డీసీపీ అడ్మిన్ ఇందిర, డిసిపి మహేశ్వరం సునీత రెడ్డి, డిసిపి రోడ్ సేఫ్టీ మనోహర్, డిసిపి ట్రాఫిక్ 1 మల్లారెడ్డి, డిసిపి ట్రాఫిక్ 2 శ్రీనివాసులు, డీసీపీ వుమెన్ సేఫ్టీ ఉషా విశ్వనాథ్, డీసీపీ సైబర్ క్రైమ్ నాగలక్ష్మి, చీఫ్ కోఆర్డినేటర్ సావిత్రిలతో పాటు పలువురు రాచకొండ కమిషనరేట్ మహిళా పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

1

# ఘనంగా విద్యోదయ హై స్కూల్ 32 వ వార్షికోత్సవం






**కబురు న్యూస్,జమ్మికుంట మార్చి 4:** జమ్మికుంట పట్టణంలోని విద్యోదయ విద్యాసంస్థలలో 32వ వార్షికోత్సవ సంబరాలు 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుకలను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. విద్యోదయ పాఠశాల డైరెక్టర్ జ్యోతి , డైరెక్టర్ ఆర్యన్ కౌశిక్ , అకాడమిక్ డైరెక్టర్ మహాలక్ష్మి నిర్వహణ సారధ్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి , జమ్మికుంట సర్కిల్ సి.ఐ. వరంగంటి రవి , జమ్మికుంట మండల విద్యాధికారిని వేముగంటి హేమలత ముఖ్య అతిథులుగా విచ్చేసి ఈ సంబరాలకు మరింత వన్నె తెచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ విద్యోదయ స్కూల్ వ్యవస్థాపకుడైన కీ.శే.లు యేబూషి రామస్వామి ని గుర్తుకు తెచ్చుకున్నారు. వారివరు మధ్య ఉన్న స్నేహ సంబంధాన్ని, రామస్వామి చేసిన కృషిని, కష్టాన్ని, సేవలను, పాఠశాల నిర్వాణ గురించి వివరించారు.

జమ్మికుంట పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ వరంగంటి రవి మాట్లాడుతూ సమాజాన్ని దృష్టిలో పెట్టుకొని విద్యార్థులను ఉద్దేశించి, చదువు గొప్పతనాన్ని విద్యార్థి చేయవలసిన మంచిని గురించి, చెడు మార్గాలను ఎంచుకోకుండా సవ్యమైన జీవితాన్ని గడపాలని, ఇతరులకు మార్గదర్శిగా ఉండాలని ప్రసంగించారు.

మండల విద్యాధికారిని వేముగంటి హేమలత చదువు గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించింది. కష్టంగా కాకుండా ఇష్టంగా చదవాలని, అన్ని రంగాల్లో రాణించాలని, దానికి మీ కృషి ఎంతో అవసరం అని విద్యార్థులకు ఉపదేశించి, పాఠశాల యాజమాన్యం మీ అందరికీ అన్ని రకాలుగా అన్ని సౌకర్యాలు కల్పించింది. విద్యోదయ యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం ఎల్లవేళలా మీతో కష్టపడినందుకు, మీరు మంచి మార్కులు సాధించి, విద్యోదయ పాఠశాలకు, తల్లిదండ్రులకు గొప్ప పేరు తీసుకరావాలని కోరుకున్నారు. విద్యోదయ పాఠశాల డైరెక్టర్ ఆర్యన్ కౌశిక్ తన తండ్రి అయిన రామస్వామి 45 మంది విద్యార్థులతో ప్రారంభించి, 3500 మంది విద్యార్థులుగా అభివృద్ధి చెందుతూ, ఎంతోమంది పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించి, విద్యార్థుల జీవితాలలో వెలుగులు నింపారనే విషయాలను గుర్తు చేశారు. తల్లిదండ్రుల సహాయ సహకారాలు, విద్యాభిమానుల, శ్రేయోభిలాషుల ఆశీస్సులు తనకుంటే తండ్రి ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడంలోనూ, అహర్నిశలు శ్రమిస్తానని, శ్రీరామస్వామి లేని లోటును తీర్చలేక పోవచ్చు, కానీ తన వంతు కృషి చేస్తానని, తల్లిదండ్రులకు విన్నవించుకున్నారు.

ఈ కార్యక్రమంలో ఆటలపోటీలు, క్విజ్ పోటీలు వంటి రకరకాల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ఇచ్చారు. విద్యార్థిని, విద్యార్థుల నాటకాలు, సాంస్కృతిక నృత్యాలు ప్రేక్షకులను ఎంతో గానో ఆకర్షించాయి.

తదనంతర కార్యక్రమంలో తొమ్మిదోవ తరగతి విద్యార్థులు పదోవ తరగతి విద్యార్థులకు వీడ్కోల్పు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, అధ్యాపక బృందం, విద్యార్థిని, విద్యార్థులు మరియు తల్లిదండ్రుల ఆనందోత్సవాల మధ్య ఘనంగా జరిగాయి.

# కన్నుల పండుగగా సాగుతున్న గ్రామ దేవతల ప్రతిష్టాపన పూజలు..

**జాతరను తలపించిన బేతిగల్ గ్రామం..**





**కబురు న్యూస్ వీణవంక, మార్చి :** వీణవంక మండలం బేతిగల్ గ్రామంలో మంగళవారం భూలక్ష్మి, మహాలక్ష్మి,బొడ్రాయి పూజలో భాగంగా,యాగశాల ప్రవేశం, శాంతి పాఠం, కుంభ ఆవాహన, ఆరాధన, అహహిత దేవత వాహనం, విగ్రహాలకు పంచామృతాభిషేకం చేసుకున్న సందర్భంగా గ్రామ దేవతల ప్రతిష్ఠ ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరగగా, గ్రామ ప్రజల సమక్షంలో ఆడబిడ్డలు మంగళహారతుల గ్రామదేవతలైన భూలక్ష్మి, మహాలక్ష్మి, బొడ్రాయి దేవతల అనుగ్రహంతో,అష్టదిక్పాలకులు దద్దరిల్లిలా, గ్రామ దేవతలకు అర్చనలు, అభిషేకాలు గ్రామం పేరు చెప్పు, సంకల్ప బలంతో హిందూ సంప్రదాయబద్ధంగా, హైందవ ధర్మంతో కూడిన మంత్ర, శాస్త్ర యుక్తంగా బ్రాహ్మణులు పూజలు జరిపిస్తూ, సకల దేవతల అనుగ్రహం గ్రామానికి ఉండాలని, సకల దోషాలు పోయి, సకల శుభాలు కలిగి, గ్రామంలోని ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, పాడిపంటలతో, సిరిసంపదలతో, కలిగి ఉండాలని,అనంతరం గ్రామ ప్రజలు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పార్టీ క్యాలెండర్లను ఆవిష్కరించిన నాయకులు



**కబురు న్యూస్ మోస్రా, మార్చి 04** మోస్ర మండలంలోని గోవుర్ గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో 2025 నూతన క్యాలెండర్ డైరీలను మంగళవారం మాజీ వైస్ ఎంపీపీ కత్తి శంకర్ స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శేఖర్ గౌడ్, వెంకటరెడ్డి, చరణ్ రెడ్డి, సతీష్, సుధాకర్ చారి, ప్రకాష్, కిరణ్ రెడ్డి, గంగారం, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# ఎమ్మెల్సీ కొమురయ్య గెలుపుతో సంబరాలు జరుపుకున్న తపస్ సభ్యులు



**కబురు న్యూస్ బాన్సువాడ మార్చి 04** ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేసి భారీ మెజార్టీతో మల్కా కొమరయ్య విజయం సాధించడంతో తపస్ బాన్సువాడ శాఖ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి విజయోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తపస్ అధ్యక్షులు నరసింహ చారి ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా కొమరయ్య గెలుపుకు కొరకు ఓటు వేసిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు రవీంద్రనాథ్ ఆర్య, రమేష్ కుమార్, శ్రీకాంత్ రెడ్డి, కిష్టయ్య, వేద ప్రకాష్, సంజీవరెడ్డి, తారాచంద్,కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ గెలుపుతో సంబరాలు జరుపుకున్న భాజపా శ్రేణులు



**కబురు న్యూస్ కామారెడ్డి మార్చి 04** ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా మల్కా కుమారయ్య మొదటి ప్రాధాన్యత ఓట్లతో విజయం సాధించడంతో మంగళవారం ఎమ్మెల్యే తాటిపల్లి వెంకటరమణారెడ్డి ఆదేశాల మేరకు భాజపా శ్రేణులు నిజాంసాగర్ చౌరస్తాలో టపాకాయలు కాల్చి, స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బిజెపి బలపరిచిన అభ్యర్థులే గెలుస్తారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో భాజపా అభ్యర్థుల గెలుపు కొరకు కార్యకర్తలు కష్టపడి పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విపుల్, అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, నాయకులు నరేందర్, రవీందర్, విజయ్, రాజు, వేణు, ప్రతాప్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# కోట దుర్గమ్మ ఆలయ వార్షికోత్సవానికి హాజరైన పోచారం, కాసుల

**కబురు న్యూస్ బాన్సువాడ మార్చి 04** బాన్సువాడ పట్టణంలోని కోట గల్లి లోని కోట దుర్గమ్మ ఆలయ ద్వితీయ వార్షికోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని వారు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవీందర్ గుప్తా, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు



# సాలూర ప్రభుత్వ పాఠశాలలో అంబరాన్నంటిన సంబరాలు





**కబురు న్యూస్,బోధన్ మార్చి 04..**
బోధన్ డివిజన్ సాలూర మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థిని, విద్యార్థుల నృత్యాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శశి భూషణ్, ప్రాథమిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లె జనార్ధన్, మండల విద్యాశాఖ అధికారి రాజీ మంజూషా, గెజిటెడ్ హెడ్మాస్టర్ శంకర్, డిస్కో సాయిలు, రిటైర్డ్ ఉపాధ్యాయులు గంగారం, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కోట దుర్గమ్మ వార్షికోత్సవంలో పాల్గొన్న యువ నాయకులు కాసుల రోహిత్





**కబురు న్యూస్ బాన్సువాడ మార్చి 04**
బాన్సువాడ పట్టణంలోని కోట గల్లీలో గల కోట దుర్గమ్మ ఆలయ రెండవ వార్షికోత్సవానికి కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు కాసుల రోహిత్ దంపతులు హాజరై ప్రత్యేక పూజలు అనంతరం యజ్ఞ యాగాదుల కార్యక్రమాన్ని నిర్వహించి, అమ్మవారి రథాన్ని లాగారు. ఈ సందర్భంగా కాసుల రోహిత్ మాట్లాడుతూ అమ్మవారి దయతో అందరూ సుఖసంతోషాలతో పాడిపంటలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో భక్తులకు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే గేట్ మొరాయించడంతో ట్రాఫిక్ జామ్...

**కబురు న్యూస్,బోధన్ మార్చి 04..**



బోధన్ పట్టణం నుండి బాన్సువాడ కు వెళ్లే రహదారి లో ఉన్న రైల్వే గేట్ సాంకేతిక లోపంతో మొరాయించింది. దీంతో పట్టణంలో పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ అయింది. మంగళవారం మధ్యాహ్న సమయంలో బోధన్ నుండి తిరుపతికి వెళ్లే రాయలసీమ ఎక్స్ప్రెస్ రైలు వెళ్లే క్రమంలో రైల్వే అధికారులు గేటు వేశారు. రైలు వెళ్లిపోయాక గేటు తీసే క్రమంలో రైల్వే గేట్ సాంకేతిక లోపంతో తేర్చుకోలేకపోయింది. రైల్వే గేట్ తెచ్చుకోకపోవడంతో ఇరువైపులా భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడి ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. రైల్వే అధికారులు ట్రాఫిక్ పోలీసుల సహకారంతో ట్రాఫిక్ క్లియర్ చేసేందుకు అధికారులు సహాయక చర్యలు చేపట్టి ట్రాఫిక్ను క్లియర్ చేశారు. రైల్వే గేట్ లో సాంకేతిక లోపాలు మరల పునరావృతం కాకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# పొలాల్లోకి దూసుకెళ్లిన పోలీస్ వాహనం...



**కబురు న్యూస్,బోధన్ మార్చి 04..**
పంట పొలాల్లోకి పోలీస్ వాహనం దూసుకెళ్లిన సంఘటన మంగళవారం సాయంత్రం బోధన్ మండలంలో చోటు చేసుకుంది. బోధన్ మండలం కల్దుర్కి గ్రామం నుండి బోధన్ కు వస్తున్న రూరల్ పోలీస్ స్టేషన్ వాహనం బండార్ పల్లి శివారు వద్ద అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్ళి భోల్తా కొట్టింది. వాహనం డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డట్టు స్థానికులు తెలిపారు.

# ప్రశ్నించే గొంతుక అవుతారని కొమురయ్యను గెలిపించారు







**– నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ...**

**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,మార్చి 04 :**
తెలంగాణ ప్రాంతీయ ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యంలో ఉపాధ్యాయ వందన కార్యక్రమం నిర్వహించారు.మంగళవారం నగరంలోని ప్రగతి నగర్ పాటిదార్ భావన్ లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇందూర్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ధన్ పాల్ మాట్లాడుతూ,ఉపాధ్యాయ సమస్యల పట్ల శాసనస మండలిలో ప్రశ్నించే గొంతుకగా మొదటి ప్రాధాన్యతతో కొమురయ్యను గెలిపించిన ఘనత ప్రతి ఒక్క ఉపాధ్యాయునికి దక్కుతుందన్నారు.మేధావులైన ఉపాధ్యాయులు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఒక చెంప పెట్టు లాంటిది అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీలు,హామీలు తుంగలో తొక్కి మాటలతో పూట గడుపుతున్న రేవంత్ సర్కార్ కు తగిన గుణపాఠం జరిగిందన్నారు.ఈ ఎమ్మెల్సి ఎన్నికల గెలుపే రేపు తెలంగాణలో బిజెపి ప్రభుత్వం ఏర్పడటానికి పునాది అవుతుందన్నారు.ఈ విజయంలో కష్టపడ్డా టీపీయూఎస్ సంఘ నాయకులకు, బిజెపి కాషాయ కార్యకర్తలకు, ఉపాధ్యాయులకు మేధావులందరికి పాదాభివందనం తెలియజేసారు.ఈ సందర్భంగా ఎన్నికల్లో కష్టపడి పని చేసి బిజెపిని గెలుపు దిశగా నడిపించిన ఉపాధ్యాయులను ఎమ్మెల్యే సన్మానించారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి,తపస్ జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి,కొండా ఆశన్న,రెంజర్ల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలను గౌరవించే చోట దేవతలు కొలువై ఉంటారు: సీపీ సుధీర్ బాబు ఐపీఎస్

**– అన్ని రంగాలలోనూ పురుషులతో సమానంగా మహిళలు పోటీపడుతున్నారు**

**కబురు న్యూస్ రంగారెడ్డి జిల్లా మార్చ్ 4:**
అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాచకొండ కమిషనరేట్ అదేవిధంగా రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు నాగోల్ లోని పిబిఆర్ కన్వెన్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల రాచకొండ పోలీసు మహిళా అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కమీషనర్ శ్రీ సుధీర్ బాబు ఐపీఎస్ మాట్లాడుతూ మహిళల్లో సంకల్ప శక్తి ఎక్కువగా ఉందని, వారు ఏదైనా సాధించగలరని అన్నారు. తమ జీవితంలో ఎన్నోరకాల వివక్షలను ఎదుర్కొంటూ, వారి ప్రతిభను ప్రదర్శించడంలో ఎదురైన అవరోధాలను అధిగమిస్తూ అన్ని రంగాల్లోనూ ఉన్నత స్థాయికి చేరుకుంటున్నారని పేర్కొన్నారు. మన దేశంలో అన్ని రంగాల్లో పురుషుల కంటే మహిళలు మెరుగ్గా రాణిస్తున్నారని, లాయర్లుగా, పోలీసు అధికారులుగా, ఇంజనీర్లుగా, డాక్టర్లుగా, శాస్త్రవేత్తలుగా, విద్యావేత్తలుగా, మరెన్నో ఇతర రంగాల్లో పని చేస్తూ తమ విజ్ఞానాన్ని, నైపుణ్యాన్ని దేశాభివృద్ధికి అందిస్తున్నారని పేర్కొన్నారు. మహిళలను గౌరవించడం మన భారత ఉపఖండంలో ఉన్న గొప్ప విషయం అని, మన దేశంలోనే కాక పొరుగు దేశాలైన శ్రీలంక, బంగ్లాదేశ్ మరియు పాకిస్తాన్ లో కూడా






స్త్రీలు అధ్యక్ష, ప్రధాని పదవులు నిర్వహించే స్థాయికి చేరుకున్నారని గుర్తు చేశారు.

మహిళలకు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లోనూ సమాన హక్కులు ఉన్నాయని, మహిళా అధికారులందరూ తమ పూర్తి శక్తితో పని చేయాలని, తమ కలల సాకారం కోసం అహర్నిశలూ పాటుపడాలని సూచించారు. పురుషుల కంటే స్త్రీలకు నిబద్ధత ఎక్కువ అని, రాచకొండ పోలీసు కమిషనరేట్ లో పలు విభాగాల్లో వందల మంది మహిళలు సమర్థవంతంగా పని చేయడం పట్ల కమీషనర్ హర్షం వ్యక్తం చేశారు. రిసెప్షన్ వంటి క్లరికల్ బాధ్యతలు మాత్రమే కాక ఎస్ఓటీ, ట్రాఫిక్, క్రైమ్ వంటి విభాగాల్లో కూడా క్లిష్టమైన బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని, గృహ హింస మరియు వైవాహిక వివాదాలలో బాధితులైన మహిళలకు కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు అనేక రకాల విధులను మహిళా పోలీసు అధికారులు నిర్వహిస్తున్నారని అభినందించారు. మహిళా అధికారులందరూ పోలీసు శాఖలో భాగమై సమాజానికి చేస్తున్న సేవను పేర్కొంటూ, మహిళలు పలు రంగాలలో సాధిస్తున్న విజయాలు రానున్న తరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని, మహిళా అధికారులందరూ ధైర్యంగా ఉండాలని, తమ వృత్తిపరమైన బాధ్యతలను గౌరవంగా నిర్వహించాలని సూచించారు. రాచకొండ కమిషనరేట్ మహిళా సిబ్బంది సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో డీసీపీ మల్కాజీగిరి పద్మజ ఐపీఎస్, డిసిపి యాదాద్రి రాజేష్ చంద్ర ఐపిఎస్, డిసిపి ఎల్బీనగర్ ప్రవీణ్ కుమార్ ఐపిఎస్, డీసీపీ అడ్మిన్ ఇందిర, డిసిపి మహేశ్వరం సునీత రెడ్డి, డిసిపి రోడ్ సేఫ్టీ మనోహర్, డిసిపి ట్రాఫిక్ 1 మల్లారెడ్డి, డిసిపి ట్రాఫిక్ 2 శ్రీనివాసులు, డీసీపీ వుమెన్ సేఫ్టీ ఉషా విశ్వనాథ్, డీసీపీ సైబర్ క్రైమ్ నాగలక్ష్మి, చీఫ్ కోఆర్డినేటర్ సావిత్రిలతో పాటు పలువురు రాచకొండ కమిషనరేట్ మహిళా పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.
1

# ఘనంగా విద్యోదయ హై స్కూల్ 32 వ వార్షికోత్సవం

**కబురు న్యూస్ జమ్మికుంట మార్చి 4**
జమ్మికుంట పట్టణంలోని విద్యోదయ విద్యాసంస్థలలో 32వ వార్షికోత్సవ సంబరాలు 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుకలను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. విద్యోదయ పాఠశాల డైరెక్టర్ జ్యోతి , డైరెక్టర్ ఆర్యన్ కౌశిక్ , అకాడమిక్ డైరెక్టర్ మహాలక్ష్మి నిర్వహణ సారథ్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి , జమ్మికుంట సర్కిల్ సి.ఐ. వరంగంటి రవి , జమ్మికుంట మండల విద్యాధికారిని వేముగంటి హేమలత ముఖ్య అతిథులుగా విచ్చేసి ఈ సంబరాలకు మరింత వన్నె తెచ్చారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ విద్యోదయ స్కూల్ వ్యవస్థాపకుడైన కీ.శే.లు యేబూషి రామస్వామి ని గుర్తుకు తెచ్చుకున్నారు. వారివరు మధ్య ఉన్న స్నేహ సంబంధాన్ని, రామస్వామి చేసిన కృషిని, కష్టాన్ని, సేవలను, పాఠశాల నిర్వాణ గురించి వివరించారు.జమ్మికుంట పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ వరంగంటి రవి మాట్లాడుతూ సమాజాన్ని దృష్టిలో పెట్టుకొని విద్యార్థులను ఉద్దేశించి, చదువు గొప్పతనాన్ని విద్యార్థి చేయవలసిన మంచిని గురించి, చెడు మార్గాలను ఎంచుకోకుండా సవ్యమైన జీవితాన్ని గడపాలని, ఇతరులకు మార్గదర్శిగా ఉండాలని ప్రసంగించారు. మండల విద్యాధికారిని వేముగంటి హేమలత






చదువు గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించింది. కష్టంగా కాకుండా ఇష్టంగా చదవాలని, అన్ని రంగాల్లో రాణించాలని, దానికి మీ కృషి ఎంతో అవసరం అని విద్యార్థులకు ఉపదేశించి, పాఠశాల యాజమాన్యం మీ అందరికీ అన్ని రకాలుగా అన్ని సౌకర్యాలు కల్పించింది. విద్యోదయ యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం ఎల్లవేళలా మీతో కష్టపడినందుకు, మీరు మంచి మార్కులు సాధించి, విద్యోదయ పాఠశాలకు, తల్లిదండ్రులకు గొప్ప పేరు తీసుకరావాలని కోరుకున్నారు.విద్యోదయ పాఠశాల డైరెక్టర్ ఆర్యన్ కౌశిక్ తన తండ్రి అయిన రామస్వామి 45 మంది విద్యార్థులతో ప్రారంభించి, 3500 మంది విద్యార్థులుగా అభివృద్ధి చెందుతూ, ఎంతోమంది పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించి, విద్యార్థుల జీవితాలలో వెలుగులు నింపారనే విషయాలను గుర్తు చేశారు. తల్లిదండ్రుల సహాయ సహకారాలు, విద్యాభిమానుల, శ్రేయోభిలాషుల ఆశీస్సులు తనకుంటే తండ్రి ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడంలోనూ, అహర్నిశలు శ్రమిస్తానని, శ్రీరామస్వామి లేని లోటును తీర్చలేక పోవచ్చు, కానీ తన వంతు కృషి చేస్తానని, తల్లిదండ్రులకు విన్న వించుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆటలపోటీలు, క్విజ్ పోటీలు వంటి రకరకాల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ఇచ్చారు. విద్యార్థిని, విద్యార్థుల నాటకాలు, సాంస్కృతిక నృత్యాలు ప్రేక్షకులను ఎంతో గానో ఆకర్షించాయి.తదునంతర కార్యక్రమంలో తొమ్మిదోవ తరగతి విద్యార్థులు పదోవ తరగతి విద్యార్థులకు వీడ్కోల్పు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, అధ్యాపక బృందం, విద్యార్థిని, విద్యార్థులు మరియు తల్లిదండ్రుల ఆనందోత్సవాల మధ్య ఘనంగా జరిగాయి.

# జిల్లా పరిషత్ పాఠశాలలో స్వయం పాలన దినోత్సవం



**కబురు న్యూస్ నిజాంపేట్ 04.03.25**

నిజాంపేట మండల పరిధిలోని చల్మెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో మంగళవారం నాడు "స్వపరిపాలన" దినోత్సవం ఘనంగా జరిగింది. విద్యార్థులే ఉపాధ్యాయులుగా తరగతులకు వెళ్లి పాఠాలు బోధించారు. తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు చెప్పడం వల్ల తమకు కలిగిన అనుభూతి మరువలేనిదని విద్యార్థులు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మంచి విద్యార్థులుగా రాణించి పాఠశాలకు మంచి పేరు తీసుకొస్తామన్నారు. కలెక్టర్ గా శ్రీనాథ్,హెచ్ఎం గా స్రవంతి,డిఈవోగా యశ్వంత్ గౌడ్, వ్యవహరించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పీజీ హెచ్ ఎం యాదగిరి, ఉపాధ్యాయులు వేణుగోపాలరావు, ఉమ్లా, రామ్మోహన్, యాదగిరి రెడ్డి, నివేదిత, రజిత, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తే చూస్తూ ఊరుకోం..

**- హాల్ టికెట్స్ ఇవ్వని కళాశాల గుర్తింపు రద్దు చేయాలి.**
**- ఆన్లైన్లో (టీజిబిఐఈ) వెబ్సైట్ ఓపెన్ చేయండి .హాల్ టికెట్ పొందండి.**
**- ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం.**

**కబురు న్యూస్ రామగుండం మార్చి, 04:**
రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని పలు ఇంటర్మీడియట్ కళాశాలలు హాల్ టికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తే చూస్తూ ఊరుకోమని ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం ఆయన అన్నారు. ఈ సందర్భంగా



ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు కొన్ని ప్రైవేట్ కళాశాలలు హాల్ టికెట్స్ ఇవ్వకుండా మానసిక ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఇలాంటి కళాశాలల గుర్తింపును రద్దు చేయాలని విద్యాధికారులను ఆయన డిమాండ్ చేశారు. ఇంటర్మీడియట్ ప్రైవేటు కళాశాలల ఆగడాల గురించి ఇంటర్ బోర్డ్ కార్యదర్శి దృష్టికి సోమవారం రోజున ఏఐఎస్ఎఫ్ గా తీసుకపోవడం వల్ల సానుకూలంగా స్పందించారని ఆయన అన్నారు.ఇంటర్మీడియట్ హాల్ టికెట్స్ ఇవ్వలేదని విద్యార్థులు బాధపడవద్దని గూగుల్ లో టీజీబీఐ అని టైప్ చేసి హాల్ టికెట్ నెంబర్ , డేట్ అఫ్ బర్త్ అప్లోడ్ చేసి గెట్ హాల్ టికెట్ అని సర్చ్ చేసి హాల్ టికెట్ డౌన్లోడ్ చేసుకోగలరని ఆయన సూచించారు. హాల్ టికెట్ పై కళాశాలకు సంబంధించిన స్టాంపు లేకున్నా కూడా పరీక్ష రాసే అవకాశం ఇంటర్ బోర్డు కార్యదర్శి కల్పించారని ఆయన అన్నారు. ఇప్పటికైనా ఇంటర్మీడియట్ కళాశాలల తీరు మార్చుకొని విద్యార్థులకు హాల్ టికెట్స్ ఇవ్వాలని , లేనిపక్షంలో పెద్ద ఎత్తున విద్యార్థులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రామగుండం కార్పొరేషన్ కార్యదర్శి ఎల్కపల్లి సురేష్, కార్పొరేషన్ అధ్యక్షులు మాతంగి సాగర్, న్యాతరి పవన్, గాజుల వినయ్, బూడిద శ్రీపాద తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సహకారంతో సీసీ రోడ్డు పనులు ప్రారంభం...



**కబురు న్యూస్ నిజాంపేట్ 04.03.25**

నిజాంపేట మండల పరిధిలోని నార్లపూర్ గ్రామంలో మంగళవారం మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, సహకారంతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించడం జరిగిందని తాజా మాజీ సర్పంచ్ అమర సేనా రెడ్డి అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రధాన రహదారి గుంతలమయంగా మారడంతో స్థానిక ఎమ్మెల్యే సిసి రోడ్డు పనులకై ముప్పై లక్షల నిధులు మంజూరు చేయడంతో రోడ్డు పనులను ప్రారంభించామన్నారు. గ్రామంలో సీసీ రోడ్డు పనులకు సహకరించిన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు నాగరాజు,భాస్కర్,కిషన్, స్వామి,సూర్య నాయక్,తదితరులు పాల్గొన్నారు.

# మల్కా కొమురయ్య గెలుపుపై నేతల హర్షం

**- స్వీట్లు పంచి నేతల సంబరాలు...**
**- తిప్పర్తి నికేశ్ ఆధ్వర్యంలో ర్యాలీకి భారీగా తరలివెళ్లిన నేతలు**

**కబురు న్యూస్ గన్నేరువరం మార్చి 4**
గన్నేరువరం,కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థి మల్కా కొమురయ్య గెలుపు పట్ల గన్నేరువరం మండల బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం గుండ్లపల్లి స్టేజి వద్ద బీజేపీ మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేశ్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నికేశ్ మాట్లాడుతూ గల్లీ నుంచి ఢిల్లీ దాకా బీజేపీ ప్రభంజనం



కొనసాగుతుందన్నారు. ఎన్నికలు ఏవైనా ప్రజలు బీజేపీ కి పట్టం గట్టి ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వాన్ని బలపరుస్తున్నారు అని పేర్కొన్నారు. తాజాగా వెలువడిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మల్కా కొమురయ్య గెలుపుతో ప్రజలు బీజేపీ వైపు ఉన్నారని, మరోసారి నిరూపితమైందన్నారు. ఇదే ఒరవడి రాబోయే రోజుల్లో కొనసాగుతుందని నికేశ్ ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థలు ఎన్నికల్లో బీజేపీ పార్టీ మెజార్టీ స్థానాల్లో గెలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

**కరీంనగర్ తరలి వెళ్లిన నాయకులు..**

ఎమ్మెల్సీ ఎన్నికల్లో మల్కా కొమురయ్య భారీ మెజారిటీతో గెలుపొందిన నేపథ్యంలో కరీంనగర్ లో నిర్వహించిన విజయోత్సవ సంబరాల్లో గన్నేరువరం మండలం అధ్యక్షుడు తిప్పర్తి నికేశ్ అధ్యర్యంలో నాయకులు భారీగా తరలివెళ్లారు ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గుంటుక శంకర్ విలాసాగరం రామచంద్రం, రాజిరెడ్డి ,కొలుపుల మహేందర్, అనిల్ రెడ్డి, పంబాల రాజశేఖర్, రామచంద్రం, సురేందర్, గాద వెంకన్న, గట్టు కిషన్, చంద్రశేఖర్, మండల సీనియర్ నాయకులు, కారియకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# టి జి రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్ సెక్రటరీ అలుగు వర్షిని కలిసిన కోరుట్ల ఎమ్మెల్యే.

**కబురు న్యూస్ మెట్ పల్లి, మార్చి 4.**
కోరుట్ల పట్టణంలోని వేములవాడ రోడ్ లో గల బీఏస్సి ప్రభుత్వ బాలికల వ్యవసాయ కళాశాలని రాజేంద్రనగర్ అగ్రికల్చర్ విశ్వవి
ద్యాలయానికి ఈ యొక్కకళాశాలను అనుబందం చేయాలని కోరుతూ మంగళవారం తెలంగాణ రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ సెక్రెటరీ అలుగు వర్షిని కలిసినట్లు కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ తెలిపారు.ఇటీవల కళాశాల విద్యార్థులు రోడ్డుపై బైఠాయించిన విషయాన్ని సెక్రటరీ తెలియ జేసి
నట్లుఎమ్మెల్యే అన్నారు.విద్యార్థులకు ప్రయోగశాల (ల్యాబ్) ఏర్పాటు, మౌలిక సదుపాయాలు నిర్మించాలని వినతిపత్రం అంద చేసినట్లు ఎమ్మెల్యే సంజయ్ తెలిపారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ సంస్థల పరిధిలో ఉన్న కోరుట్ల మహిళ బీఏస్సి వ్యవసాయ కళాశాలరాజేంద్రనగర్ అగ్రికల్చర్ విశ్వవిద్యాలయంతో అనుబంధం చేయాలని కోరినట్లు తెలిపారు.ప్రతిష్టాత్మక



రాజేంద్రనగర్ అగ్రికల్చరల్ శ్వవిద్యాలయంతో అనుబంధం చేయాలని కోరారు..ఈ అనుబంధం ద్వారా విద్యార్థులకు మెరుగైన వనరులు, అధ్యాపకులు , పరిశోధన అవకాశాలకు అందిస్తుందని తెలిపారు. అగ్రికల్చరల్విద్యను అందించే దిశగా ఈ అనుబంధం ఒక ముఖ్యమైన దశ అనిపేర్కొన్నారు.మౌలికసదుపాయాల అభివృద్ధి కొరకు అనుసంధానం చేయాలనిఅన్నారు.సరిపోనికళాశాల పాఠశాల భవన సదుపాయాలునం చేయాలని తీవ్రమైన మౌలిక సదుపాయాలు ఈ కళాశాల ఎదుర్కొంటుదని తెలిపారు.బాలికల విద్యార్థులకు ముఖ్యంగా ప్రత్యేక మరుగుదొడ్లు,అదనపు గదులవంటి ప్రాథమిక సౌకర్యాలు లేవని వాటికి అవసరమైన మౌలిక సదుపాయాల నిర్మాణానికి అవసరమైన నిధులను కేటాయించాలని కోరినట్లు ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. అలాగేల్యాబ్ ప్రయోగశాల స్థాపన కొరకు మాట్లాడినట్లు తెలిపారు వ్యవసాయ విద్యకు శిక్షణ , ప్రయోగశాల అవసరం అయినప్పటికీ ఈ కళాశాలలో ప్రయోగశాల లేదని అత్యాధునిక పరికరాలతో ఆధునిక ప్రయోగశాల స్థాపనకు అవసరమైన నిధులను అందించాలని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమస్యలన్నింటినీ సామరస్యంగా విని అందించే విధంగా ప్రయత్నిస్తానని తెలిపినట్లు ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్

# ధర్నాకు వెళ్తున్నా అంగన్వాడి టీచర్ల అక్రమ అరెస్టులు



**కబురు న్యూస్ నిజాంపేట్ 04.03.25**
నిజాంపేట మండల అంగన్వాడీ టీచర్లనుమంగళవారం ఉదయం పోలీసులు ముందస్తు అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్లకు కనీస వేతనం పెంచాలని ధర్నాకు వెళ్తున్న క్రమంలో పోలీసులు అక్రమ అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్ తరలించడం దారుణం అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్న వేతనాలే వస్తున్నాయి కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచిన అంగన్వాడీ టీచర్లకు18 వేల వేతనాన్ని పెంచుతామని చెప్పి నేటికి నెరవేర్చలేదన్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అంగన్వాడి టీచర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో
అంగన్వాడీ టీచర్లు అరుణశ్రీ, రేణుక, దుర్గేశ్వరి,మణెమ్మ,సుధా, సునీత, వీణ,రామలక్ష్మి,తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక ట్రాక్టర్ పట్టివేత...

**కబురు న్యూస్, బోధన్ మార్చి 04..**
ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్ ను పట్టుకున్నట్లు పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు. ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ ను మంగళవారం సాయంత్రం పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ దగ్గర ఆపి ఇసుక రవాణా కి సంబందించిన అనుమతి పత్రాలను అడగడం జరిగిందని, ట్రాక్టర్ డ్రైవర్ ఎలాంటి అనుమతి పత్రాలు చూపకపోవడంతో అట్టి ట్రాక్టర్ %ూ 16జు=% 8468 ను,డ్రైవరును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఎవరైనా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్య లు తీసుకోవడం జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

# సిబ్బంది లేక రోగులు ఇబ్బంది పడుతున్నారు.

**కబురు న్యూస్ గన్నేరువరం మార్చి 4**
గన్నేరువరం మండల కేంద్రంలో ఉన్న ఆయుర్వేదిక్ వైద్యశాలకు ఎప్పుడు చూసినా తాళం వేసే ఉంటుందని, దీంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రాష్ట్ర యువజన నాయకుడు సంపతి ఉదయ్ కుమార్ మంగళవారం ఆయుర్వేద వైద్యశాల ముందు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా సంపతి ఉదయ్ మాట్లాడుతూ మంగళవారం మండల కేంద్రంలోని ఆయుర్వేద వైద్యశాలకు మధ్యాహ్నం రెండు గంటలకు సమస్యతో వస్తే ఆయుర్వేద దావకానకు తాళం వేసి



ఉందని, ఆయుర్వేద వైద్య శాల ముందు సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశాడు. సిబ్బంది సమయపాలన పాటించడం లేదని, ఆయుర్వేద వైద్యానికి అలవాటు పడిన వృద్ధులు, సిబ్బంది లేక ఆయుర్వేద దవాఖాన మూసి ఉండడంతో రోగులు నానా ఇబ్బంది పడాల్సి వస్తుంది. అన్నారు. ఆయుర్వేద సిబ్బంది కోసం హాస్పిటల్ ముందు వృద్ధులు నిరీక్షించి తిరిగి వెళ్ళిపోతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నంత అధికారులు స్పందించి సమయపాలన లేని వైద్య సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకొని ఆయుర్వేద వైద్యశాలకు డాక్టర్ ఇతర సిబ్బందిని సమకూర్చాలని సంపతి ఉదయ్ కుమార్ డిమాండ్ చేశాడు.

# తీన్మార్ మల్లన్న వెంటనే రాజీనామా చేయాలి.

**- జగిత్యాల జిల్లా సేవాదళ్ అధ్యక్షులు అందే మారుతి.**

**కబురు న్యూస్ మెట్ పల్లి, మార్చి 4.**
తీన్మార్ మల్లన్న కాంగ్రెస్ పార్టీ నుండి ఎమ్మెల్సీగా గెలుపొంది పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడి బహిష్కరణకు గురైన చింతపండు నవీన్ కుమార్ అలియాస్ తీన్మార్ మల్లన్న పార్టీ ఇచ్చిన పదవికి వెంటనే రాజీనామా చేసి నిజాయితీనినిరూపించుకోవాలనిజగిత్యాల.జిల్లాసేవాదాల అధ్యక్షులు అందే మారుతి మంగళవారం బాపూజి డిమాండ్ చేశారు.పార్టీఇచ్చిన పదవిలో ఉంటూ అదే పార్టీ ముఖ్యమం త్రినివిమర్శించడంసిగ్గుచేటు అని అన్నారు. వెంటనే పదవికి రాజీనామా చేసి మళ్లీ ప్రజా తీర్పుకోరాలని అన్నారు. బిజెపి, బీఆర్ఎస్ తో కుమ్మక్కైన తీన్మార్ మల్లన్న కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తూ బీసీల కోసం మొసలి కన్నీరు కార్చడం ప్రజలకు అర్థమైందని అన్నారు. అలా చేస్తే ప్రజలు క్షమించరని తెలియజేశారు. బీసీ వాదం పేరిట మొసలి కన్నీరు కార్చి పబ్బం



గడిపే ప్రయత్నం చేస్తే ప్రజలు ఉపేక్షించాలని వెంటనే రాజీనామా చేయకపోతే రానున్న రోజుల్లో భారీ మూల్యం చెల్లించక తప్పదని అందే మారుతి తెలియ జేశారు.

# నేటి నుండే ఇంటర్ పరీక్షలు ప్రారంభం.. విద్యార్థులు ఒత్తిడిని జయిస్తే, విజయం మీ సొంతం...

**- యుఫ్ టీవీ సీఈవో పాడి ఉదయ్ రెడ్డి.**

**కబురు న్యూస్,వీణవంక, మార్చి 4.**




వీణవంక మండలంలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు పలు సూచనలను మీరు అనుసరిస్తే మంచి మార్కులు సాధించవచ్చు. మొదటగా పరీక్షలు అంటే టెన్షన్ వద్దు మీకున్న ఒత్తిడి జయిస్తే, విజయం మీరే సాధిస్తారని, యుఫ్ టీవీ సీఈవో పాడి ఉదయ నందన్ రెడ్డి మాట్లాడుతూ.. ఇంటర్ పరీక్షలు మార్చి 5 నుండి 24 వరకు ఇంటర్ బోర్డు పరీక్షలు నిర్వహిస్తున్నారు.కావున విద్యార్థులు ఇంటర్ విద్యార్థులు భవిష్యత్తులో ఇలాంటి ఎన్నో బోర్డు ఎగ్జామ్స్ రాస్తారు. మీరు సంవత్సరం మొత్తం నేర్చుకున్న జ్ఞానం మీ సబ్జెక్టుల పైన మీకు వచ్చిన పరిజ్ఞానాన్ని అంచనా వేయడం కోసం పెట్టే పరీక్షలు కావున మీకు ఒక పండుగ వాతావరణం లాగా ఉండాలి తప్ప పరీక్షలు చూసి భయపడొద్దు. విద్యార్థులకు భవిష్యత్తుకు మార్గం వేసే ఈ పరీక్షలు కాబట్టి మంచి మార్కులు సాధించడం ఎంతో ముఖ్యం, ప్రతి విద్యార్థి మంచి మార్కులు సాధించాలంటే పరీక్షలపై ప్రత్యేక దృష్టి సాధించాల్సిన అవసరం చాలా ఉంది, అయితే పరీక్షలు సమయం తక్కువ ఉండడంతో కొందరు విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు సిలబస్ మొత్తం చదవడం పూర్తి కాలేదు అని కొందరు, రివిజన్ కాలేదని మరికొందరు టెన్షన్ పడుతుంటారు. ఈ సమయంలో టెన్షన్ పడవద్దు ఇప్పటికే చదివిన పాఠాలను రివిజన్ చేస్తుండాలి, చివరి నిమిషంలో కొత్త టాపిక్స్ జోలికి వెళ్ళకూడదు కొత్త టాపిక్ లు చదవడం వల్ల దాన్ని రివిజన్ చేస్తే సమయం లేకపోతే గుర్తుండకపోవచ్చు కొంతమంది విద్యార్థులు పరీక్షల్లో ఫెయిల్ అవుతామని, తల్లిదండ్రులు ఏమంటారోనని మానసికంగా ఇబ్బందులు పడుతుంటారు అలాంటి విద్యార్థులకు వారి తల్లిదండ్రులు అండగా నిలబడి ధైర్యాన్ని విద్యార్థులకి ఒత్తిడి తగ్గించే సూచనలు చేయాలి. అప్పుడే వారు ప్రశాంతంగా టెన్షన్ లేకుండా చదివి పరీక్షలు రాయడానికి అవకాశం ఉంటుందన్నారు.

# నల్లగొండ లక్ష్మీ నృసింహ స్వామి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించాలి...

**- మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి..**

**కబురు న్యూస్, శంకరపట్నం మార్చి 4**

తిమ్మాపూర్ మండలం నల్లగొండ శ్రీ సీతారామ లక్ష్మీ నృసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా నిర్వహించాలని మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు.మంగళవారం కరీంనగర్ జిల్లా, మానకొండూర్ నియోజకవర్గం, తిమ్మాపూర్ మండలంలోని, నల్లగొండ దేవస్థానాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఎమ్మెల్యే సత్యనారాయణ ఆలయ పరిసర ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు వీలుగా చర్యలు చేపట్టాలన్నారు. భక్తుల కొంగుబంగారమైన శ్రీ సీతారామ లక్ష్మీ నృసింహస్వామి వారి జాతరకు కరీంనగర్ జిల్లా నుంచే





కాకుండా ఇతర ప్రాంతాలను నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వస్తుంటారని, ఇక్కడికి వచ్చే భక్తులు ఇబ్బందులు పడకుండా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు.ముఖ్యంగా రథోత్సవం, బండ్లు తిరిగే రోజు ఎలాంటి అపశృతులు దొర్లకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే.. నల్లగొండ దేవస్థానంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ ను ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. తిమ్మాపూర్ మండలం రామకష్ణ కాలనీకి చెందిన గొరిటాల సతీష్ వాటర్ ప్లాంట్ ను దేవస్థానానికి బహూకరించారని, భక్తుల దాహార్తిని తీర్చేందుకు వాటర్ ప్లాంట్ అందజేయడం మహత్కార్యమంటూ ధాత సతీష్ ను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ బండారు లక్ష్మణ్, తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధగోని లక్ష్మినారాయణ గౌడ్, పార్టీ నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాస్ రావు, కొత్త తిరుపతిరెడ్డి,గంగ్ర శ్రీనివాస్, దేవస్థానం డైరెక్టర్లు గాజుల అంజయ్య,బూత్కూరి శ్రీనివాస్, కందుకూరి లక్ష్మిరాజం, జినుక శ్రీనివాస్, మార్క మొండయ్య, రొడ్డ సాగర్, పూజారి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లమ్మ జాతరలో ఎమ్మెల్యే కవ్వంపల్లి ప్రత్యేక పూజలు...

**కబురు న్యూస్,శంకరపట్నం మార్చి 4**







ఎల్లమ్మతల్లి బోనాల జాతరకు ఎమ్మెల్యే డాక్టర్ సత్యనారాయణ హాజరు. మానకొండూర్ నియోజకవర్గం,బెజ్జంకి మండల కేంద్రంలో మంగళవారం ఎల్లమ్మతల్లి బోనాల జాతరలో మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొన్ని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం ఎమ్మెల్యే మాడ్లాడుతూ ఎల్లమ్మతల్లి ఆశీస్సులు మానకొండూర్ నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నట్లు చెప్పారు.ఈ బోనాల జాతరలో బెజ్జంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, బ్లాక్ కాంగెస్ అధ్యక్షుడు ఒగ్గె దామోదర్, బెజ్జంకి మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అక్కరవేణి పోచయ్య ముదిరాజ్, పార్టీ నాయకులు చెలువేరు శ్రీనివాస్ రెడ్డి, జెల్ల ప్రభాకర్, పులి సంతోష్, లింగాల శ్రీనివాస్, మధు, భైర సంతోష్, ఎ.శ్రీనివాస్ రెడ్డి, బి.రమేశ్, శరత్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మిస్టరి హత్య కేసును చేదించిన గుమ్మడిదల పోలీసులు

**- జిన్నారం సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎం డి నయీముద్దీన్**
**- గుమ్మడిదల సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎం. మహేశ్వర్ రెడ్డి**

**కబురు న్యూస్, సంగారెడ్డి మార్చ్ 04,**

సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల పోలీస్ స్టేషన్ పరిధిలో నేరం సంఖ్య: 232/2024 U/s 65(1), 103 బి ఎన్ ఎస్, రేప్, అండ్ మర్డర్, పోలీస్ గుమ్మడాలలో కేసు నమోదు చేసుకొని గుమ్మడిదల దర్యాప్తు చేసి మిస్టరీ హత్య కేసును చేదించడం జరిగింది,నేరస్థుడు: గుగులోత్ పూర్య తండ్రి నర్సింగ్, వయస్సు: 52సం,లు, కులం: ఎస్.టి(లంబాడి), వృత్తి:వ్యవసాయం, గ్రామం: బిక్య ఏ నంద్యా తండా, హెచ్. ఓ. రాంజ్య తండా, నర్సాపూర్ మండలం, మెదక్ జిల్లా అను అతడు తేది. 28.12.2024 రోజున కేతవాత్ మునీ భర్త రాజు గ్రామం కన్నారం శేరి



తండా, కౌడిపల్లి మండలం ను మాయమాటలు చెప్పి గుమ్మడిదల కల్లు షాప్ నుండి ఆమెను నల్లవల్లీ అడవిలోకి తేసుకెల్లి, శారీరకంగా కలసి, చున్నితో ఆమె గొంతుకు చుట్టి ఉపిరాడకుండా చేసి చంపినాడు, ఇట్టి కేసులో యం.డి.నయీముద్దీన్, సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జిన్నారం, గారి అద్వర్యంలో, యం.మహేశ్వర్ రెడ్డి, సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ గుమ్మడిదల, పి.వెంకటేశం హెడ్-కానిస్టేబుల్, ఏ.సికిందర్ పోలీస్ కానిస్టేబుల్, టి. కిషోర్ పోలీస్ కానిస్టేబుల్, కె. సాయివర్ధన్ రెడ్డి పోలీస్ కానిస్టేబుల్ బృందాలుగా ఏర్పడి నేరస్థుడిని సి సి కెమెరాల ద్వారా గుర్తించి



నేరస్థుని ఈరోజు తేది 04.03.2025 రోజున పట్టుకొని, నేరంలో వాడిన అతని TVSXL మోటార్ సైకిల్ , సెల్ ఫోన్ లను సీజ్ చేసి నేరస్థుడిని కోర్టుకు రిమాండ్ కు తరలించానైనది. ఇట్టి మర్డర్ కేసును చేదించిన యం.మహేశ్వర్ రెడ్డి ఎస్.ఐ. పి. గుమ్మడిదల,పి.వెంకటేశం హెడ్-కానిస్టేబుల్, ఏ. సికిందర్ పోలీస్ కానిస్టేబుల్, టి. కిషోర్ పోలీస్ కానిస్టేబుల్, కె. సాయివర్ధన్ రెడ్డి పోలీస్ కానిస్టేబుల్ గార్లను జిన్నారం సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ అబినందించినారు.

# కిష్టారెడ్డిపేట్ దుర్గమ్మ జాతరలో పాల్గొన్న ఐలాపూర్ మాణిక్ యాదవ్



**కబురు న్యూస్, సంగారెడ్డి జిల్లా మార్చ్ 04,**

సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం అమీన్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని కిష్టారెడ్డిపేట గ్రామంలో నిర్వహించిన దుర్గాదేవి జాతరలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆ కనకదుర్గాదేవి చల్లని చూపు ప్రజలందరి మీద ఉండాలని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో పాడి పశువులతో ఆరోగ్యంవంతమైన జీవితాలను ప్రసాదించాలని మనస్ఫూర్తిగా ఆ దేవిని ప్రార్థించడం జరిగింది ఈకార్యక్రమంలో భారతి నగర్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి, ఆర్.సి పురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య యాదవ్, కృష్ణరెడ్డిపేట గ్రామ సర్పంచ్ ఏర్పుల కృష్ణ, కృష్ణ కాంత్, శ్రీధర్, దర్శన్, నర్సింగరావు, శివ, రాలకతో గ్రామ యువజన నాయకుడు నీరుడి మహేష్, గణేష్, గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లలో వికలాంగులకు 5శాతం కేటాయించాలి.

**- ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డ్స్ జారీ చేసి 150 రోజులు పని కల్పించాలి**
**- మార్చి 17న కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా**
**- అత్తిమెళ్ళ మాణిక్యం, రాష్ట్ర ఉపాధ్యక్షులు కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం తెలంగాణ రాష్ట్ర నాయకులు**
**- ఎం. అడివయ్య, ఎన్ పి ఆర్ డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**

**కబురు న్యూస్, సంగారెడ్డి జిల్లా మార్చ్ 4,**

తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్లలో వికలాంగులకు 5శాతం కేటాయించాలని, ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డ్స్ జారీ చేసి 150 రోజులు పని కల్పించాలని మార్చి 17న కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్నామని ఎన్.పి. ఆర్.డి. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం.అడివయ్య తెలిపారు,ఈ రోజు కేవల్ కిషన్ భవన్లో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక సంగారెడ్డి జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు యం. బస్వరాజు పాటిల్ అధ్యక్షతన జరిగింది.

ఈ సమావేశానికి హాజరై అయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లలో వికలాంగులకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని, లబ్ధిదారులు ఎంపికలో వికలాంగులను ఎంపిక చేయాలని డిమాండ్



చేశారు.స్వంత ఇల్లు లేని వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.ఉపాధి హామీ పథకంలో వికలాంగులకు 150 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి గ్రామంలో వికలాంగులతో శ్రమ శక్తి సంఘాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రయివేట్ పరిశ్రమలలో అర్హత కలిగిన వికలాంగులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు.అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పెన్షన్ 6000లకు పెంచి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కొత్త పెన్షన్స్ మంజూరు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని అన్నారు.కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో వికలాంగుల కు తీవ్ర అన్యాయం చేసిందని అన్నారు.వికలాంగుల సంక్షేమ పథకాలకు నిధుల కోత విధించిందని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం 2025-26 బడ్జెట్ లో పెన్షన్ పెంపు కోసం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

ఎన్.పి.ఆర్.డి. జిల్లా గౌరవ అధ్యక్షులు ఏ. మాణిక్



మాట్లాడుతూ వికలాంగుల సమస్యల పరిష్కారం చేయడంలో ప్రభుత్వం విఫలం చెందుతుందని అన్నారు,ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వికలాంగులకు ఎందుకు కేటాయించడం లేదన్నారు.జిల్లాలో వికలాంగులపై దాడులు పెరిగిపోతున్నాయని అన్నారు.వికలాంగులను కించపరుస్తూ మాట్లాడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయాని అన్నారు.

ఈ సమావేశంలో ఎన్ పి ఆర్ డి మహిళా విభాగం రాష్ట్ర కన్వీనర్ సాయమ్మ, జిల్లా కార్యదర్శి కొనింటి నర్సిములు, జిల్లా ఉపాధ్యక్షులు జయలక్ష్మి, రాజు కుమార్, రాంచందర్, శోభారాణి, సహాయ కార్యదర్శులు సత్యనారాయణ, బిస్మిల్లా, శంకర్ నాయక్, జిల్లా కమిటీ సభ్యులు కృపాకర్,చెన్నరెడ్డి, రాములు, కృష్ణ, సుధాకర్, నర్సింహా తదితరులు పాల్గొన్నారు

# బిజెపి అభ్యర్థి మల్క కొమురయ్య ఉపాధ్యాయ ఎమ్మెల్సీ విజయోత్సవ ర్యాలీ

**- జిన్నారం మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా లో టపాసులు పేల్చి సంబరాలు నిర్వహించిన భారతీయ జనతా పార్టీ నాయకులు**

**కబురు న్యూస్, సంగారెడ్డి జిల్లా మార్చ్ 4,**

సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం జిన్నారం మండలం లో భారతీయ జనతా పార్టీ నాయకుల సంబరాలు టీచర్ ఎమ్మెల్సీగా మల్క కొమురయ్య గెలిచిన శుభ సందర్భంగా జిన్నారం మండలంలో భారతీయ జనతా పార్టీ నాయకులు కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు ఈ కార్యక్రమంలో పటాన్ చెరువు నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్ గుప్తా జిన్నారం మండల బిజెపి అధ్యక్షులు కొత్త కాపు జగన్ రెడ్డి సంగారెడ్డి



జిల్లా కిషన్ మోర్చా ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు డా. అశోక్ కుమార్ పాటిల్, జిన్నారం మండలం ప్రధాన కార్యదర్శి మద్దూరి రాజు సంగారెడ్డి జిల్లా సీనియర్ నాయకులు దోమడుగు రమేష్, విద్యుల్లత సుధాకర్ రెడ్డి అగ్రహారం శంకర్ కొరివి దేవేందర్ నరసింహారెడ్డి పద్మారావు మద్దూరు మహేష్ సీతా రాజు బండి వెంకటేష్ బుక్క బిక్షపతి లడ్డు ప్రవీణ్ నవీన్ వడ్ల సత్యనారాయణ మహేష్ యాదవ్ వికాస్ సింగ్ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# బాలీవుడ్‌కి మరోసారి !

కబురు సినిమా మార్చి04:
భిన్నమైన పాత్రలు పోషిస్తూ తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటోన్న కథానాయిక మాళవిక మోహనన్ . ప్రస్తుతం ఆమె కథానాయకుడు ప్రభాస్ సరసన పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న 'రాజాసాబ్' సినిమాలో నటిస్తోన్న సంగతి తెలిసిందే. గతేడాది 'యుద్రా'సినిమాతో బాలీవుడ్‌లో అడుగుపెట్టి.. ఆశించిన మేరకు ఫలితాలు అందుకోలేకపోయిన ఈమె. ఇప్పుడు మరో భారీ ప్రాజెక్టులో నటించనున్నట్లు సమాచారం. రొమాంటిక్ కామెడీ నేపథ్యంలో రూపొందనున్న ఈ చిత్రం కోసం ఓ పెద్ద సంస్థతో చేతులు కలిపినట్లు తెలుస్తోంది. ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో అధికారికంగా ప్రకటించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు మాళవిక సన్నిహిత వర్గాలు తెలిపాయి.



# వార్ 2 అప్డేట్.. నాటు నాటుని మించేలా ఎన్టీఆర్, హృతిక్ లపై డ్యాన్స్-ఆఫ్ సీక్వెన్స్

కబురు సినిమా మార్చి04:
జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న బాలీవుడ్ డెబ్యూ మూవీ 'వార్ 2'. బాలీవుడ్ స్టార్ హృతిక్ రోషన్ హీరోగా నటించిన వార్ సినిమాకు సీక్వెల్‌గా వస్తున్న ఈ సినిమాను దర్శకుడు అయాన్ ముఖర్జీ తెరకెక్కిస్తున్నాడు.లేటెస్ట్‌గా వార్ 2 మూవీ సెట్‌లో ఎన్టీఆర్, హృతిక్ రోషన్ లపై సాంగ్ షూట్ జరగనుంది. నేడు (మార్చి 4న) అంధేరీలోని యష్ రాజ్ స్టూడియోస్‌లో వార్2లో వచ్చే ఓ ఎపిక్ డ్యాన్స్-ఆఫ్ సీక్వెన్స్ చిత్రీకరణను ప్రారంభించనున్నారు మేకర్స్.ఇందులో 500 మందికి పైగా డ్యాన్సర్లు ఈ అద్భుతమైన నృత్య యుద్ధంలో పాల్గొంటారు. ఆరు రోజుల పాటు భారీ స్థాయిలో ఈ ఎపిక్ డ్యాన్స్-ఆఫ్ సీక్వెన్స్‌ను షూట్ చేయటకు మేకర్స్ సిద్ధమయ్యారు. ఇది క్లైమాక్స్ ఫైట్ సెట్-పీస్‌లోకి వెళ్ళే ఒక అద్భుతమైన డ్యాన్స్ యుద్ధంని మేకర్స్ చెబుతున్నారు.అయితే, ప్రీతమ్ మ్యూజికల్‌లో రానున్న ఈ సాంగ్‌ని బాస్కో మార్టిస్ కొరియోగ్రాఫర్ చేస్తున్నాడు. ఇందుకోసం ప్రొడక్షన్ డిజైనర్ అమృత మహల్ అద్భుతమైన సెట్‌ను నిర్మించారని, ప్రీతమ్ చాలా ఫాస్ట్ బీట్‌తో సాగే పాటను కంపోజ్ చేశారని బాలీవుడ్ నివేదికలు చెబుతున్నాయి.ఈ డ్యాన్స్-ఆఫ్ ఆలోచన నిర్మాత ఆదిత్య చోప్రా నుండి వచ్చినట్లు తెలుస్తోంది. అలాగే, ఈ ఇద్దరు స్టార్ హీరోలతో ఒకరిపై ఒకరు పోటీగా చేసే ఈ డ్యాన్స్ నంబర్ సినిమాకే హైలైట్‌గా ఉంటుందని సినీ వర్గాలు వెల్లడించాయి.ప్రస్తుతం ఇందుకు సంబంధించిన న్యూస్ వైరల్ అవుతుండటంతో ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఖుషి అవుతున్నారు. తమ అభిమాన నటుడు కాలు కదిపితే భూకంపాలే అంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. చూడాలి మరి ఎన్టీఆర్-చరణ్ చేసిన నాటు నాటు పాటని మించేలా ఉంటుందోమో! భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా లెవల్లో తెరకెక్కుతున్న ఈ సినిమాలో ఇండియన్ రా ఏజెంట్‌గా ఎన్టీఆర్ కనిపించనున్నాడు. ఈ సినిమా కోసం ఎన్టీఆర్ భారీ మొత్తాన్ని రెమ్యునరేషన్‌గా తీసుకుంటున్నారట. కేవలం ప్రత్యేక పాత్ర కోసం ఏకంగా రూ.100 కోట్లు అందుకోనున్నాడట ఎన్టీఆర్. ఈ విషయం తెలుసుకున్న బాలీవుడ్ స్టార్స్ అవాక్కవుతున్నరట.కారణం.. అక్కడ చాలా మంది స్టార్స్ ఉన్నప్పటికీ ఏ హీరో కూడా ఫుల్ సినిమాకి సైతం రూ.100 కోట్లు రెమ్యునరేషన్‌గా అందుకోలేదు. షారుఖ్, సల్మాన్, ఆమిర్ వంటి స్టార్స్ మాత్రమే ఈ రేంజ్ లో రెమ్యునరేషన్ తీసుకున్నారు. ఇప్పుడు కేవలం స్పెషల్ రోల్ కోసం ఎన్టీఆర్ ఈ రేంజ్ లోల్ ఛార్జ్ చేస్తుండటం హాట్ టాపిక్ గా మారింది. ఈ విషయంపై నెటిజన్స్ కూడా రియాక్ట్ అవుతున్నారు.



# వారంతా బ్యాడ్ డైరెక్టర్స్.. నేను మార్పు తీసుకొద్దామనుకున్నా కానీ

కబురు సినిమా మార్చి04:
ఏ రంగంలోనైనా అడుగుపెట్టిన కొత్తలో ఆ ఇండస్ట్రీ రూపు రేఖలే మార్చేయాలని చాలామంది అనుకుంటుంటారు. అప్పటికే పని చేస్తున్న వారికంటే తామే ప్రతిభావంతులమని ఫీలవుతారు. కొంత అనుభవం వచ్చిన అనంతరం వాస్తవాన్ని గ్రహిస్తారు. చిత్ర పరిశ్రమలోకి వచ్చిన కొత్తలో తానూ ఇలాంటి ఆలోచనలతోనే ఉన్నట్టు ప్రముఖ దర్శకుడు ప్రశాంత్ నీల్ తెలిపారు. అక్కినేని అమల తో కలిసి పాల్గొన్న ఓ కార్యక్రమంలో కెరీర్ ప్రారంభ రోజులు గుర్తుచేసుకున్నారు."సినిమా చూడడం తేలికైన వ్యవహారం. కానీ, తెరకెక్కించడం కష్టం. నా విషయానికొస్తే.. 2014లో నేను తీసిన తొలి చిత్రం 'ఉగ్రం'. దాని షూటింగ్ ప్రారంభంకాక ముందు.. 'ఇప్పటి వరకూ సినిమాలు తెరకెక్కించిన వారంతా బ్యాడ్ డైరెక్టర్స్ (నవ్వుతూ). ఇండస్ట్రీలో మనమే మార్పు తీసుకురావాలి' అని అనుకునేవాడిని. కానీ, మూవీ మేకింగ్ ఎంత కష్టమో కొంత భాగం చిత్రీకరణ పూర్తయ్యాక అర్థమైంది. ఈ సినిమా 10 మంది చూసినా చాలు అని అనిపించింది. ఫిల్మ్ మేకింగ్ టెన్నిస్‌లాంటిది కాదు క్రికెట్‌లాంటిది. బృందంతో కలిసి పని చేయాలి. టీమ్ వర్క్ ఉంటేనే మంచి విజయం అందుకుంటామనే విషయాన్ని త్వరగానే గ్రహించా" అని తెలిపారు.

# పెళ్లి కాని ప్రసాద్ అనే నేను...

కబురు సినిమా మార్చి04:
తన వంశానికి చెందిన శాసనాల గ్రంథం అనుసరించే పెళ్లి చేసుకుంటానని ప్రసాద్ ప్రమాణం చేశాడు. అప్పట్నుంచి అతనికి పెళ్లి విషయంలో ఎలాంటి సవాళ్లు ఎదురయ్యాయి? ఇంతకీ పెళ్లయిందా లేదా? తదితర విషయాలు తెలియాలంటే 'పెళ్లి కాని ప్రసాద్' చూడాల్సిందే. సప్తగిరి, ప్రియాంకశర్మ నాయకానాయికలుగా నటించిన చిత్రమిది. అభిలాష్‌రెడ్డి గోపిడి దర్శకత్వం వహిస్తున్నారు. కె.వై.బాబు, భానుప్రకాశ్ గౌడ్, సుక్కా వెంకటేశ్వర్ గౌడ్, వైభవ్ రెడ్డి ముత్యాల కలిసి నిర్మిస్తున్నారు. ఈ నెల 21న ప్రేక్షకుల ముందుకు రానుందీ చిత్రం. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ సంస్థ విడుదల చేస్తుంది. సోమవారం అగ్ర కథానాయకుడు ప్రభాస్ ఈ సినిమా టీజర్‌ని విడుదల చేశారు. 'ప్రసాద్ అనే నేను...' అంటూ మొదలైన టీజర్‌లో కథానాయకుడు సప్తగిరి, సప్తగిరి మురళీధర్ గౌడ్ చేసిన హంగామా ప్రధాన ఆకర్షణగా నిలిచింది. హాస్యం, సామాజిక వ్యాఖ్యానం మేళవింపుగా రూపొందిన ఈ చిత్రం తప్పకుండా ప్రేక్షకుల్ని మెప్పిస్తుందని సినీ వర్గాలు తెలిపాయి. లక్ష్మణ్, అన్నపూర్ణమ్మ, ప్రమోదిని, బాషా, శ్రీనివాస్, ప్రభావతి, రోహిణి, రాంప్రసాద్ కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రానికి సంగీతం: శేఖర్‌చంద్ర, ఛాయాగ్రహణం: సుజాత సిద్ధార్థ్, సమర్పణ: చాగంటి సినిమాటిక్ వరల్డ్.

# హీరో లేకుండా సినిమా తీస్తా


## ఆసక్తికర కామెంట్స్ చేసిన సందీప్ వంగా

కబురు సినిమా మార్చి04:



సందీప్ వంగా సినిమాలకు ప్రత్యేకమైన అభిమానులు ఉంటారు. తొలి చిత్రంతోనే టాలీవుడ్, బాలీవుడ్‌లలో తనకంటూ ఫ్యాన్ బేస్‌ను క్రియేట్ చేసుకున్నారీ దర్శకుడు. సాధారణంగా సందీప్ వంగా సినిమాల్లో హీరోలకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుందని కామెంట్స్ వినిపిస్తుంటాయి. 'యానిమల్'లో స్త్రీని తక్కువ చేసి చూపించారని కొందరు సినీ ప్రముఖులు అసహనం వ్యక్తంచేశారు. తాజాగా ఈ దర్శకుడు ఆసక్తికర కామెంట్స్ చేశారు. అసలు హీరో లేకుండా సినిమా తీస్తానని చెప్పారు.ఓ యూట్యూబ్ ఛానల్ ఇంటర్వ్యూలో పాల్గొన్న సందీప్ తన సినిమాలపై వచ్చిన విమర్శల గురించి మాట్లాడారు. అదే సమయంలో ఆయనకు ఓ ప్రశ్న ఎదురైంది. 'మీరు పాటలు లేకుండా సినిమా తీస్తారా? లేదంటే హీరో లేకుండా తీస్తారా?. రెండిటిలో ఒకదాన్ని ఎంచుకోండి' అని అడిగారు. దానికి సందీప్ వెంటనే సమాధానమిచ్చారు. "హీరో లేకుండా సినిమా తీయాలనేది నా ఆలోచన. ఒకవేళ అలాంటి సినిమా తీస్తే.. నా చిత్రాలను విమర్శించిన మహిళలు దాన్ని కూడా ఇష్టపడరు. కావాలంటే ఈ విషయాన్ని నేను రాసిస్తాను. 4, 5 సంవత్సరాల్లో నేను హీరో లేకుండా సినిమా తీస్తాను. ఇప్పుడు విమర్శిస్తున్న వారంతా '5 ఏళ్ల క్రితం సందీప్ చెప్పింది. చేసి చూపించాడు' అని మాట్లాడుకుంటారు" అని చెప్పారు.ప్రస్తుతం సందీప్ వంగా ప్రభాస్ 'స్పిరిట్' పనుల్లో బిజీగా ఉన్నారు. ఈ సినిమా కలెక్షన్ల గురించి మాట్లాడుతూ.. దీని రికార్డులు బాహుబలిని దాటాలని లేదన్నారు. రూ.2000 కోట్లు అనేది చాలా పెద్ద విషయమన్నారు. ఇదైతే మంచి సినిమా అని చెప్పారు. ఎంత వసూళ్లు సాధిస్తుందనేది ప్రేక్షకుల చేతుల్లో ఉంటుందన్నారు.

# నాని 'ది ప్యారడైజ్' రిలీజ్.. ఆ సెంటిమెంట్ ఫాలో అవుతున్న హీరో



కబురు సినిమా మార్చి04:
వరుస సినిమాలతో విభిన్న కథలతో అలరించేందుకు సిద్ధమవుతున్నారు హీరో నాని . ప్రస్తుతం హిట్ 3, 'ది ప్యారడైజ్' చిత్రాలతో బిజీగా ఉన్నాడీ హీరో. తాజాగా 'ది ప్యారడైజ్' ప్రత్యేక వీడియో విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 26న ప్రేక్షకుల ముందుకురానున్నట్లు తెలిపారు. దీంతో నెటిజన్లు ఓ ఆసక్తికర విషయాన్ని షేర్ చేస్తున్నారు. నాని తన సినిమాల విషయంలో గురువారం సెంటిమెంట్ ఫాలో అవుతున్నారని కామెంట్ చేస్తున్నారు.నాని కెరీర్‌లోనే 'దసరా' సూపర్ హిట్‌గా నిలిచింది. భారీ వసూళ్లను కూడా సొంతం చేసుకుంది. ఈ సినిమా 2023 మార్చి 30న గురువారం ప్రేక్షకుల ముందుకువచ్చింది. దీని తర్వాత వచ్చిన నాని చిత్రాలు కూడా గురువారమే విడుదలయ్యాయి. హాయ్ నాన్న (2023 డిసెంబర్ 7), సరిపోదా శనివారం (2024 ఆగస్టు 29) తర్వాత లైనప్‌లో ఉన్న చిత్రం 'హిట్-3' ఈ ఏడాది మే 1న విడుదల కానుంది. ఆ రోజు కూడా గురువారమే. దీని తర్వాత వచ్చే ఏడాది విడుదల కానున్న 'ది ప్యారడైజ్' కూడా ఆ వారమే రిలీజ్ కానుంది. దీంతో నాని గురువారం సెంటిమెంట్‌ను బాగా ఫాలో అవుతున్నారని ఎక్స్‌లో పోస్టులు కనిపిస్తున్నాయి. భవిష్యత్తులో రానున్న సినిమాలకు కూడా ఇదే సెంటిమెంట్ ఫాలో అవుతూ బ్లాక్‌బస్టర్ విజయాలు సొంతం చేసుకోవాలని కోరుతున్నారు.'ది ప్యారడైజ్' విషయానికొస్తే.. 'దసరా' సినిమాతో సూపర్ హిట్ అందుకున్న నాని - శ్రీకాంత్ ఓదెల కాంబోలో ఇది రానుంది. నాని లుక్.. గెటప్పు.. అన్నీ ఊరనాటుగా కనిపించనున్నాయి. తిరుగుబాటు, నాయకత్వంతో పాటు తల్లీకొడుకుల అనుబంధం కథకు కీలకంగా నిలవనున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ, బెంగాలీ భాషలతో పాటు ఇంగ్లిష్, స్పానిష్ లాంటి విదేశీ భాషల్లోనూ ఒకేసారి విడుదల కానుంది.

Printed & Published and owned by K. Shiva Kumar Goud, Printing at Srinika Printers, Railway Kaman Track, Sony Function Haal Road, Nizamabd.(TS). Editor: K. Shiva Kumar Goud. Registration No. APTEL/1999/00110/, kaburueveningdaily9106@gmail.com